



# పెన్ పవర్

తెలుగు దిన పత్రిక    ప్రశ్నించడం మన హక్కు






సంపుటి : 12 సంచిక : 216 పేజీలు :8 సంపాదకులు : జి.ఎ.రావు ( ఆనంద్ గంట్యాడ) ప్రచురణ : విశాఖపట్నం శనివారం 11 ఏప్రిల్ 2026 వెల : 1/-రూ ॥


VOLUME :12 ISSUE :216 PAGES :8 EDITOR : G. A. RAO ( ANAND GANTYADA ) PUBLISHED : VISAKHAPATNAM SAT 11 APRIL 2026 PRICE : 1/- RS

Simultaneously Published form Visakhapatnam,Kakinada,Bapatla,NarasaraoPeta,Ongole,YSR Kadapa,Circulated by :Srikakulam,manyam,Vizianagaram,East Godavari,West Godavari,Eluru,Guntur,SPSR Nellore,Tirupati,Chittor,Kurnool,Anantapur


# పీఎన్జీ కనెక్షన్లు వేగవంతం చేయండి..

## రాష్ట్రంలో గ్యాస్ సరఫరాపై సీఎం చంద్రబాబు సమీక్ష

- రాష్ట్రంలో గ్యాస్ సరఫరాపై ముఖ్యమంత్రి చంద్రబాబు ఉన్నతస్థాయి సమీక్ష
- పీఎన్జీ వినియోగాన్ని పెంచాలని, 6 నెలల్లో 10 లక్షల కనెక్షన్లు ఇవ్వాలని లక్ష్యం
- దీపం లబ్ధిదారులు పీఎన్జీకి మారినా రాయితీ కొనసాగించాలని నిర్ణయం
- శ్రీకాకుళం-కాకినాడ పైప్‌లైన్ పనుల జాప్యంపై కేంద్ర మంత్రికి సీఎం ఫోన్
- యుద్ధాల నేపథ్యంలో ఎల్పీజీ కొరత రాకుండా ప్రత్యామ్నాయ చర్యలకు ఆదేశం




**పెన్ పవర్ డెస్క్:**రాష్ట్రంలో గ్యాస్ సరఫరా, పైప్డ్ నేచురల్ గ్యాస్ (పీఎన్జీ) కనెక్షన్ల పురోగతిపై ముఖ్యమంత్రి చంద్రబాబు సచివాలయంలో ఉన్నతస్థాయి సమీక్ష నిర్వహించారు. అంతర్జాతీయంగా యుద్ధాల కారణంగా ఎల్పీజీ గ్యాస్ సరఫరాలో తలెత్తుతున్న సవాళ్లను ఎదుర్కొనేందుకు పూర్తి సన్నద్ధతతో పనిచేయాలని అధికారులను, ఆయిల్ కంపెనీల ప్రతినిధులను ఆయన ఆదేశించారు. ప్రత్యామ్నాయంగా పీఎన్జీ వినియోగాన్ని ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లాలని స్పష్టం చేశారు. వచ్చే 6 నెలల్లో రాష్ట్రవ్యాప్తంగా 10 లక్షల కొత్త పీఎన్జీ కనెక్షన్లు ఇవ్వాలని లక్ష్యంగా నిర్దేశించారు. ఈ విషయంలో ఎలాంటి జాప్యం జరగకూడదని, నిర్దేశిత లక్ష్యాన్ని ఎట్టిపరిస్థితుల్లోనూ చేరుకోవాలని తేల్చిచెప్పారు. ఈ సమీక్షలో భాగంగా 'దీపం' పథకం లబ్ధిదారులను పీఎన్జీ వైపు ప్రోత్సహించడంపై సీఎం ప్రత్యేకంగా దృష్టి సారించారు. దీపం లబ్ధిదారులు పీఎన్జీ కనెక్షన్‌కు మారితే, వారికి పథకం కింద అందే రాయితీ

మిగతా 2లో

## మంత్రులకు చంద్రబాబు సీరియస్ వార్నింగ్..

### ఇంకో సారి రిపీట్ కాకూడదంటూ హెచ్చరిక



- మూడు గంటల పాటు కొనసాగిన కేబినెట్ సమావేశం
- సమావేశానంతరం మంత్రులతో చంద్రబాబు ప్రత్యేక భేటీ
- ప్రభుత్వ సమాచారం లీక్ అవుతుండటంపై సీఎం సీరియస్
- మరోసారి రిపీట్ అయితే మంత్రులను బాధ్యులను చేస్తానంటూ వార్నింగ్
- గతంలో ఇలాంటి లీకుల వల్లే కేబినెట్‌ను ఎన్టీఆర్ రద్దు చేశారని గుర్తు చేసిన వైనం

మిగతా 2లో

### నవ రాయ్‌పూర్‌ను ఉదాహరణగా చూపుతూ

## అమరావతిపై సజ్జల విమర్శలు

- అమరావతిలో సామాన్య ప్రజలు నివసించే పరిస్థితి లేదన్న సజ్జల
- అమరావతిని అవినీతికి తరగని గనిలా చంద్రబాబు వాడుకుంటున్నారని ఆరోపణ
- ఆకాశహర్మ్యాలు కట్టడం వల్ల రాష్ట్రానికి ఆదాయం ఎలా వస్తుందో చెప్పలేకపోతున్నారని విమర్శ



**పెన్ పవర్ డెస్క్:**ముఖ్యమంత్రి చంద్రబాబు నిర్మిస్తున్న అమరావతి రాజధాని 40 ఏళ్లయినా పూర్తికాదని, అదొక అసాధ్యమైన ఆలోచన అని వైసీపీ రాష్ట్ర కో-ఆర్డినేటర్ సజ్జల రామకృష్ణారెడ్డి అన్నారు. ఛత్తీస్‌గఢ్‌లోని నవ రాయ్‌పూర్‌ను ఉదాహరణగా చూపుతూ, అక్కడ కేవలం భవనాలు మాత్రమే ఉన్నాయి తప్ప జనం లేరని, అమరావతి

మిగతా 2లో



## నమాజ్ కోసం ఉగ్రవాదులపై దాడిని వాయిదా వేశాం..

### ఆపరేషన్ సిందూర్ రహస్యాలు వెల్లడించిన ఆర్మీ చీఫ్

- ఉగ్రవాద శిబిరంపై దాడిని నమాజ్ కోసం వాయిదా వేసిన సైన్యం
- 'అందరి దేవుడు ఒక్కడే' అనే భావనతోనే ఈ నిర్ణయమన్న ఆర్మీ చీఫ్
- సైన్యంలో మహిళల చేరికపై కుమార్తెల సలహాలు తీసుకుంటానన్న జనరల్ ద్వివేది
- మార్కుల కన్నా వ్యక్తిత్వం, పరిస్థితులకు అనుగుణంగా మారడమే ముఖ్యం

మిగతా 2లో



## ట్రెండ్ ను ఫాలో కావొద్దు... సవాళ్లను స్వీకరించండి

### బెంగళూరులో నారా లోకేశ్

- బెంగళూరు గ్రీన్‌వుడ్ హై స్కూల్ గ్రాడ్యుయేషన్ వేడుకల్లో మంత్రి లోకేశ్
- సవాళ్లను స్వీకరించి లక్ష్యంపై దృష్టి పెట్టాలని యువతకు సూచన
- షార్ట్ కట్ల ప్రపంచంలో నైతికతే గొప్ప బలమని ఉద్బోధ
- ఏపీ, విశాఖ అభివృద్ధిలో సత్వా గ్రూప్ భాగస్వామి కానుందని వెల్లడి

**పెన్ పవర్ డెస్క్:**యువత సవాళ్లను స్వీకరించి ముందుకు సాగాలని, ట్రెండ్‌ను అనుసరించకుండా నిర్దిష్ట లక్ష్యంపై దృష్టి సారించాలని ఆంధ్రప్రదేశ్ ఐటీ, విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్ పిలుపునిచ్చారు. బెంగళూరులోని సర్జాపూర్‌లో ఉన్న గ్రీన్‌వుడ్ హై ఇంటర్నేషనల్ స్కూల్ ఐబీడీపీ (గ్రేడ్-12) 2026 గ్రాడ్యుయేషన్ డే వేడుకలకు ఆయన

మిగతా 2లో



## పులివెందులకు 'అవి గొడ్డలి' అని పేరు పెట్టండి

- అమరావతికి 'మావిగన్' పేరుపై జగన్‌ను ఎగతాళి చేసిన షర్మిల
- అవినాశ్ రెడ్డి పేరు మీద పులివెందులకు 'ఆవి గొడ్డలి' అని పేరు పెట్టాలంటూ వ్యంగ్యం
- గన్నులు, గొడ్డళ్లే వైసీపీ సిద్ధాంతమా అని తీవ్ర విమర్శ
- ఐదేళ్లలో రాజధానికి ఇటుక కూడా పెట్టలేదని ఆరోపణ
- 'మావిగన్' ఆలోచన ఒక జోక్ అని కొట్టిపారేసిన షర్మిల

మిగతా 2లో



### భాగ్యనగరంలో 'ప్రేమ' ముసుగులో

## మతం మార్పిడి దందా


### అన్నదమ్ముల ఘాతుకం వెలుగులోకి

**పెన్ పవర్ డెస్క్:**హైదరాబాద్‌లోని పంజాగుట్ట పోలీస్ స్టేషన్ పరిధిలో హిందూ యువతులను లక్ష్యంగా చేసుకుని సాగు తున్న ఒక దారుణమైన

మిగతా 2లో

### భోగాపురం విమానాశ్రయం

## ప్రారంభోత్సవానికి మోదీకి ఆహ్వానం!



- తుది దశకు చేరుకున్న భోగాపురం విమానాశ్రయం పనులు
- మోదీకి నాలుగు తేదీలను సూచించిన ఏపీ ప్రభుత్వం
- ఈ విమానాశ్రయంతో మారిపోనున్న ఉత్తరాంధ్ర రూపురేఖలు

మిగతా 2లో



## యూపీలో పడవ బోల్తా... 10 మంది మృతి...

### ప్రధాని మోదీ దిగ్భ్రాంతి

- మధురలోని యమునా నదిలో పడవ బోల్తా
- ప్రమాదంలో 10 మంది యాత్రికులు మృతి
- 14 మందిని కాపాడిన సహాయక బృందాలు
- గల్లంతైన వారి కోసం కొనసాగుతున్న గాలింపు చర్యలు
- ప్రమాదంపై ప్రధాని, యూపీ సీఎం దిగ్భ్రాంతి

**పెన్ పవర్ డెస్క్:**ఉత్తరప్రదేశ్‌లోని మధుర జిల్లాలో ఘోర పడవ ప్రమాదం జరిగింది. బృందావన్‌లోని కేశీఘాట్ వద్ద యమునా నదిలో యాత్రికులతో వెళుతున్న పడవ బోల్తా పడటంతో 10 మంది మృతి చెందారు. మరో 14 మందిని సహాయక బృందాలు సురక్షితంగా కాపాడాయి. గల్లంతైన వారి కోసం గాలింపు చర్యలు కొనసాగుతున్నాయి. వివరాల్లోకి వెళితే, పంజాబ్‌కు చెందిన సుమారు 30 మంది యాత్రికులు శుక్రవారం మధ్యాహ్నం పడవలో యమునా నదిలో ప్రయాణిస్తున్నారు.

మిగతా 2లో

## లొంగిపోయిన 42 మంది మావోయిస్టులు.. కీలక వ్యాఖ్యలు చేసిన తెలంగాణ డీజీపీ

- లొంగిపోయిన వారిలో బెటాలియన్ డిప్యూటీ కమాండర్ స్థాయి నేత కేశాలు
- ఏడాదిన్నర కాలంలో 763 మంది మావోయిస్టులు లొంగిపోయారన్న డీజీపీ
- తెలంగాణలో నలుగురు మావోయిస్టులు మాత్రమే మిగిలిపోయారని వెల్లడి
- వారు కూడా లొంగిపోవాలని పిలుపు

**పెన్ పవర్ డెస్క్:**తెలంగాణలో మావోయిస్టుల కార్యకలాపాలు క్రమంగా తగ్గుముఖం పడుతుండగా, తాజాగా భారీ సంఖ్యలో మావోయిస్టులు పోలీసుల ఎదుట లొంగిపోయారు. రాష్ట్ర డీజీపీ శివధర్‌రెడ్డి సమక్షంలో మొత్తం 42 మంది మావోయిస్టులు తమ ఆయుధాలను వదిలి జనజీవన స్రవంతిలోకి చేరారు. లొంగిపోయిన వారిలో బెటాలియన్ డిప్యూటీ కమాండర్ స్థాయి కలిగిన కేశాలు

మిగతా 2లో



## ఎడిటర్ వ్యూ

## ఏకధ్రువ ప్రపంచానికి చెక్ పెట్టినట్లేనా!

ప్రతిమనిషి పుట్టుకతోనే జీవించే హక్కుతో భూమిమీదకు వస్తాడు. మరణం అనేది ఆ హక్కుకు దూరం కావడమే! సాధారణ మరణం సహజ ప్రక్రియ. యుద్ధ మరణం అనేది ఉన్మాద చర్యతో జీవించే హక్కును అర్థాంతరంగా తుంచివేయడం. అందుకే ఏరకమైన యుద్ధమైనా వినాశ హేతువే? యుద్ధం ఒక పీడకచర్య. యుద్ధ మరణాలకు హేతుబద్ధత ఉండదు. మధ్యయుగాలలో యుద్ధమంటే వీరత్వానికి ప్రతీక. అటు తర్వాత ఆయుధం ప్రధానపాత్ర వహించింది. అధికారానికి ఆయుధం ప్రాకారంగా నిలిచింది. సాంకేతికత అభివృద్ధి చెందిన ఈ దశలో ఆయుధానిదే పైచేయి అయింది. ఇప్పుడు యుద్ధ వ్యూహాల్లో మార్పులొచ్చాయి. ఒకప్పుడు రష్యా, అమెరికా ప్రచ్ఛన్న యుద్ధస్థితి నుంచి, రష్యా అంతర్గత రాజకీయ మార్పుల తర్వాత అమెరికా ఏకధృవ ప్రపంచంగా ఎదిగింది. అంతేకాదు, తమ భూభాగంలో కాకుండా ప్రపంచం మొత్తం యుద్ధ స్థావరాలు ఏర్పరచుకొని, సైన్యాన్ని మోహరించి ప్రపంచ పోలీసుగా పెత్తనం చేస్తోంది. జనరల్ గడాఫీ, అలెండీ, సద్దాం హుస్సేన్ లాంటి ఎందరో దేశాధినేతలను హత్య చేయడంతో పాటు, ఆసియా, అమెరికా, ఆఫ్రికా ఖండాల్లో అనేక దేశాలతో యుద్ధాలు చేసింది. చివరకు తమ వ్యాపార సామ్రాజ్యానికి పోటీరాకుండా జపాన్‌లోని హిరోషిమా, నాగసాకి నగరాలపై అణుబాంబులు వేసి సాముహిక మానవహననానికి అమెరికా పాల్పడింది. వియత్నాంతో పదహారేళ్ల సుదీర్ఘ యుద్ధం తర్వాత అమెరికా దూకుడుకు కళ్లెం పడింది.

ఇప్పుడు ఇరాన్‌తో భూతల యుద్ధంతో తలపడడం అంటే చావునోట్లో తలపెట్టడమేనన్న వ్యవహారం అర్థమైన తర్వాత ఇంటా, బయట ఏకాకిగా మారిన ట్రంప్, వ్యూహం మార్చి ఇరాన్‌తో సీజ్ ఫైర్‌కు తాపత్రయ పడ్డాడు. వ్యూహాత్మకంగా ఊపిరి పీల్చుకోవడానికి ఇరాన్ కూడా పది షరతులతో సిద్ధమైంది. సీజ్‌ఫైర్ అనబడే ఒప్పందం అనేది ఇటీవల కాలంలో ముందుకొచ్చిన దౌత్య ప్రక్రియనే. ఒకప్పుడు గ్రూపుల మధ్య ఒప్పందం ఇప్పుడు దేశాల మధ్యకు మారింది. భారత్-పాకిస్తాన్, ఇరాన్-ఇజ్రాయిల్ యుద్ధాలలో ట్రంప్ ముందుకు తెచ్చిన ప్రక్రియనే ఇది. కొత్తదేం కాదు, కాకుంటే ఓటమి అంచుల్లో పరువు దక్కించుకునే ఏకైక సూచిక! ట్రంప్ రెండువారాల యుద్ధ వెసులుబాటుకు ప్రయత్నమే ఆయనలో నెలకొన్న ఓటమి భయానికి నిదర్శనం. ఇరాన్‌లో 240మంది మహిళలు, 212 మంది పిల్లలు వెరసి 2076 మంది ప్రజలు యుద్ధంలో మరణించారు, 26,500 ప్రజలు గాయపడ్డారు. మిత్రదేశం లెబనాన్‌లో మరో 13వందల మంది ప్రజలను ఇజ్రాయిల్ చంపేసింది. అంతేకాదు, యుద్ధ ప్రారంభంలోనే ఇజ్రాయిల్, అమెరికా కుట్రపూరితంగా ఇరాన్ సుప్రీం లీడర్ అయుతుల్లా ఖొమైనీని అంతం చేసింది. అయినా ఇరాన్ తమ మౌలిక వనరుల రక్షణ దృష్టితో సీజ్‌ఫైర్‌కు అంగీకరించింది.

సుదీర్ఘ కాలం తమవెంట ఉన్న పశ్చిమ యూరప్ దేశాల యుద్ధ కూటమి ''నార్త్ అట్లాంటిక్ ట్రీటీ ఆర్గనైజేషన్' నాటోలోని 30 దేశాలు ఇరాన్‌పై ట్రంప్ దాడికి మద్దతివ్వలేదు. సరికదా కొన్ని దేశాలు నేరుగా ఇరాన్‌కు మద్దతు తెలిపాయి. ఇక ప్రపంచ దేశాల ప్రజలతో పాటు, తనదేశంలో ప్రజలు నిరసన పతాకస్థాయికి చేరడంతో ట్రంప్ ఓ అడుగు సీజ్‌ఫైర్ పేరుతో వెనక్కి తగ్గాడు తప్ప, తనలోని యుద్ధ పిపాసి ఇంకా చావలేదు. ట్రంప్ అధికారంలోకి వచ్చిన తర్వాత పిచ్చోడి చేతిలో రాయిలా ప్రపంచ దేశాలపై టారిఫ్‌ల పేరుతో విరుచుకుపడ్డాడు. గాజా విషయంలో ఇజ్రాయిల్ అమానుష కాండకు పరోక్షంగా మద్దతిచ్చాడు. పనామా అధ్యక్షుడు నోరిగోను మాదకద్రవ్యాల పేరుతో జైలు శిక్ష వేసి నిర్భందించాడు.''ఆపరేషన్ అబ్జార్వేట్ రిజర్వ్'' పేరుతో ప్రజలచేత ఎన్నికైన వెనెజులా అధ్యక్షుడు మదురో, ఆయన భార్య సిలియాలను అర్థరాత్రి ఇంటినుంచి కిడ్నాప్ చేసి అమెరికా జైలులో నిర్బంధించాడు.కేవలం ఆయిల్‌పై నియంత్రణ కోసం ఒకదేశ సార్వభౌమత్వాన్ని ప్రశ్నార్థకం చేయడమే కాక, తన పదవీ కాలం ముగిసిన తర్వాత వెనెజులాలో ఎన్నికలని కుళ్లు జోకులు వేస్తున్నాడు. పక్క రాష్ట్రం మెక్సికోతో ఘర్షణ, చిన్నదీవి లాంటి దేశం క్యూబాపై మానవత్వం మరచి ఆంక్షలు పెట్టడంతో పాటు, ఇరాన్ యుద్ధం తర్వాత క్యూబా అంతు చూస్తానంటున్నాడు. మరోవైపు పక్క దేశం కెనడాను తమదేశంలో అంతర్భాగం రాష్ట్రంగా కలుపుకుంటామని అవాకులు చవాకులు పలుకుతున్నాడు. నాటోలో అంతర్భాగమైన డెన్మార్క్‌కు చెందిన గ్రీన్‌లాండ్‌ను స్వాధీనం చేసుకుంటామని ప్రకటించి నాటో కూటమి దేశాల్లో తమ పరపతి కోల్పోయాడు.

ఆఫ్ఘనిస్తాన్‌లోని కాందహార్ విమానాశ్రయం కావాలని పట్టుబడుతున్నాడు. ఇవన్నీ ట్రంప్ ఆయా దేశాల సార్వభౌమాధికారాన్ని గౌరవించకుండా వేస్తున్న చిల్లర వేషాలు తప్ప మరొకటి కాదు. మరో ముఖ్యమైన విషయం. ఎప్‌స్టీన్ ఫైల్స్ నుండి బయటపడడం కోసం, అత్యంత పెద్దదైన ఆసియా ఖండంలో పట్టుకోసం మరో యుద్ధోన్మాద దేశం ఇజ్రాయిల్‌తో కలిసి కుట్రపన్నాడు! ఇరాన్‌ను ఓడిస్తే తనకు ప్రపంచంలో తిరుగుండదని, యుద్ధ ప్రారంభంలోనే ఖొమైనీ లాంటి ఆయువుపట్టును లేపేస్తే, తాను వెనెజులా దేశంలా ఇరాన్‌ను కబళించి ఆధిపత్యం చెలాయించాలని చేసిన ప్రయోగం బెడిసికొట్టింది. నలభై రోజులుగా యుద్ధంలో ఇరాన్ అటు ఇజ్రాయిల్‌తో పోరాడుతూనే, అమెరికా అవకాశ ఆధిపత్యాన్ని వ్యూహాన్ని సవాల్ చేసి నిలబడింది. ఇరానియన్ రిపబ్లిక్ గార్డుల ధైర్య సాహసాలముందు అమెరికా తలవంచక తప్పలేదు. అగ్రరాజ్య ఆధునిక యుద్ధ విమానాలను కూల్చివేయడంతో ట్రంప్ దిక్కుతోచని స్థితిలో పడ్డాడు. అంతర్గత సంక్షోభం, అధికార మార్పిడి లాంటి మాటలు ఇరాన్‌లో తుత్తునీయలు కావడం, ప్రపంచ పాలక వర్గాలు ఎలావున్నా ప్రజలు మద్దతు ఇరాన్‌కు అను కూలంగా ఉండడం, ఇరాన్ కూడా భౌగోళిక యుద్ధ తంత్రం హార్మూజ్ జలసంధి మూసివేత, గల్ఫ్‌లో ఉన్న సౌదీ అరేబియా తదితర దేశాల్లో అమెరికా సైనిక శిబిరాలు, ఆయా దేశాల సాంకేతిక, ఆర్థిక వనరులపై వ్యూహాత్మకంగా దాడులు జరపడం ద్వారా అమెరికాకు వణుకు పుట్టించిందని చెప్పవచ్చు. ఇజ్రాయిల్ కోసం అమెరికా ఇరాన్‌పై దండయాత్రకు దిగింది. తమకు అమెరికా ప్రజలతో ఎలాంటి శత్రుత్వం లేదని ఇరాన్ ప్రకటించడం ఆ దేశ కుయుక్తిని ఎండగట్టింది. అమెరికా ఇరాన్ యుద్ధంలో ఒంటరై ఏకధృవ ప్రపంచం ఏవగింపునకు గురైంది. ఈ దశలో సీజ్‌ఫైర్ రెండు వారాల తర్వాత శాశ్వత ఒప్పందం జరుగుతుందా? యూటర్న్ తీసుకుంటుందా? ఈ విషయం నిర్ధారించే పరిస్థితి లేదు. ఎందుకంటే ఒప్పందం జరిగింది అమెరికా-ఇరాన్ మధ్య కనుక తాము యుద్ధం ఆపేది లేదని ఇజ్రాయిల్ తన యుద్ధ దాహం తీరక లెబనాన్‌పై బాంబుల వర్షం కురిపిస్తోంది. అందుకు ప్రతిగా ఇరాన్ సైతం గల్ఫ్‌లో ఇజ్రాయిల్, అమెరికా అనుకూల దేశాలపై దాడులు చేస్తోంది. అమెరికా-ఇరాన్ యుద్ధం ద్వారా రష్యా ఒకింత ఆయిల్ వ్యాపార రిత్యా, ఉక్రెయిన్ వైపు అమెరికా ఆయుధ సంపత్తి అందకుండా చేయడంలో సఫలమైంది. చైనా, ఉత్తరకొరియా, రష్యా దేశాలు ఇరాన్‌కు అందించిన సాంకేతిక, ఆయుధ మద్దతు ఆ దేశం నిలబడడానికి చాలా తోడ్పాటునందించింది. హార్మూజ్ జలసంధి విషయంలో చైనా, రష్యా, ఫ్రాన్స్ ఐక్యరాజ్యసమితిలో తమ వీటో అధికారంతో ఇరాన్‌కు మద్దతు పలకడం అమెరికా ఏకఛత్రాధిపత్యానికి ఒక రకంగా చెక్ పెట్టినట్లే!

## పులివెందులకు 'అవి గొడ్డలి' అని పేరు పెట్టండి

ఏపీ కాంగ్రెస్ అధ్యక్షురాలు వైఎస్ షర్మిల, తన సోదరుడు, వైసీపీ అధినేత జగన్ పై వ్యంగ్యాస్త్రాలు సంధించారు. ఏపీ రాజధానికి 'మావిగన్' అని పేరు పెట్టాలన్న జగన్ ప్రతిపాదనను ఆమె తీవ్రంగా ఎగతాళి చేశారు దీనికి కౌంటర్‌గా, పులివెందుల నియోజకవర్గానికి 'అవి గొడ్డలి' అని పేరు మార్చాలంటూ సంచలన సెటైర్ వేశారు. ఈ వ్యాఖ్యలు ఏపీ రాజకీయాల్లో పెను దుమారం రేపాయి.జగన్ ప్రతిపాదించిన 'మావిగన్' ఆలోచనను పూర్తిగా అపహాస్యం చేసిన షర్మిల, వైసీపీ సిద్ధాంతంపై ఘాటు వ్యాఖ్యలు చేశారు. "ఎంతసేపు గన్నులు, గొడ్డళ్లేనా? నరకాలి, చంపాలి, నాశనం చేయాలనే ఆలోచిస్తారా?" అని ఆమె ప్రశ్నించారు. జగన్ పేరులో 'గన్' ఉందని, వైఎస్ అవినాశ్ రెడ్డి పేరులో 'వినాశనం' ఉందని, వారి ఆలోచనా విధానం కూడా హింస చుట్టూనే తిరుగుతుందని ఆమె ఆరోపించారు. వివేకా హత్య కేసును పరోక్షంగా ప్రస్తావిస్తూ, "అమరావతికి మీ పేరు మీద 'మావిగన్' అని పెడితే, పులివెందులకు అవినాష్ రెడ్డి పేరు మీద 'అవి గొడ్డలి' అని పెట్టాలి" అని ఎద్దేవా చేశారు.గత ఐదేళ్ల పాలనలో జగన్ రాజధాని అమరావతి కోసం ఒక్క ఇటుక కూడా పెట్టలేదని షర్మిల విమర్శించారు. అధికారంలోకి రాగానే ప్రజావేదికను కూల్చివేయడంతోనే పాలన మొదలుపెట్టారని గుర్తుచేశారు. "ఇప్పుడు అమరావతి వద్దు, మావిగన్ పెడతారట. ఈ ఐడియా అంత అద్భుతంగా ఉంటే, ఐదేళ్లు అధికారంలో ఉన్నప్పుడు ఎందుకు అమలు చేయలేదు?" అని ఆమె నిలదీశారు. 'మావిగన్'కు ఖర్చు తక్కువైతే, మరి మూడు రాజధానుల ప్రతిపాదన ఎందుకు తెరపైకి తెచ్చారని ప్రశ్నించారు.జగన్ 'మావిగన్' ప్రతిపాదనపై తమ వైఖరి ఏంటని అడుగుతున్నారని, ఎవరైనా ఓ జోక్ వింటే గట్టిగా నవ్వాలి తప్ప స్పందించాల్సిన అవసరం లేదని ఆమె కొట్టిపారేశారు. ఇదే సందర్భంలో, గతంలో నిండు సభలో వైఎస్ విజయమ్మను అవమానించినందుకు మంత్రి బొత్స సత్యనారాయణ ఎంత ఏడ్చినా తక్కువేనని కూడా షర్మిల వ్యాఖ్యానించారు.

# మంత్రులకు చంద్రబాబు సీరియస్ వార్నింగ్..

ముఖ్యమంత్రి చంద్రబాబు అధ్యక్షతన సచివాలయంలో జరిగిన ఆంధ్రప్రదేశ్ మంత్రివర్గ సమావేశం పలు కీలక నిర్ణయాలతో ముగిసింది. సుమారు మూడు గంటల పాటు సుదీర్ఘంగా సాగిన ఈ భేటీలో రాష్ట్ర అభివృద్ధికి సంబంధించిన అంశాలతో పాటు, కేంద్ర ప్రభుత్వం, ప్రధాని మోదీకి ప్రత్యేక ధన్యవాదాలు తెలుపుతూ తీర్మానాలు చేశారు. అయితే, అజెండా అంశాలపై చర్చ ముగిసిన తర్వాత మంత్రులతో ప్రత్యేకంగా సమావేశమైన ముఖ్యమంత్రి, ప్రభుత్వ సమాచారం లీక్ అవుతున్న తీరుపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. కేబినెట్ అజెండా, ఇతర రహస్య వివరాలు సమావేశానికి ముందే బయటకు రావడంపై మంత్రులను నిలదీశారు. గతంలో ఇలాంటి లీకుల కారణంగానే ఎన్టీఆర్ తన కేబినెట్‌ను రద్దు చేయాల్సి వచ్చిన విషయాన్ని గుర్తు చేస్తూ, భవిష్యత్తులో ఇలాంటివి పునరావృతమైతే సంబంధిత మంత్రులనే బాధ్యులను చేస్తూ కఠిన చర్యలు తీసుకుంటానని స్పష్టమైన హెచ్చరిక జారీ చేశారు.

ప్రభుత్వ పథకాల అమలు తీరుపై కూడా ముఖ్యమంత్రి మంత్రులకు దిశానిర్దేశం చేశారు. ముఖ్యంగా 'జలధార' పథకం ప్రయోజనాలు ప్రజల్లోకి బలంగా వెళ్లేలా అవగాహన కల్పించాలని సూచించారు. భూములకు సంబంధించిన పాస్‌బుక్స్ పంపిణీ వ్యవహారంపై రెవెన్యూ యంత్రాంగం అప్రమత్తంగా ఉండాలని... మంత్రులు, అధికారులు నెలకు కనీసం నాలుగు సార్లు జిల్లాల్లో పర్యటించి క్షేత్రస్థాయి పరిస్థితులను పర్యవేక్షించాలని ఆదేశించారు. అలాగే కేంద్ర ప్రభుత్వ 'సూర్య ఘర్' పథకం లక్ష్యాలను వచ్చే ఏడాది నాటికి పూర్తి చేసేలా ప్రత్యేక దృష్టి సారించాలని మంత్రులకు స్పష్టం చేశారు. పార్లమెంట్‌లో ప్రవేశపెట్టనున్న మహిళా బిల్లు అంశంపై కూడా కేబినెట్‌లో ప్రాథమిక చర్చ జరిగింది.

రాష్ట్రంలో మున్సిపల్ ఎన్నికల నిర్వహణపై కూడా ప్రభుత్వం కసరత్తు మొదలుపెట్టినట్లు తెలుస్తోంది. రాబోయే మూడు నుంచి నాలుగు నెలల వ్యవధిలో

స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించే అవకాశాలపై కేబినెట్ సుదీర్ఘంగా చర్చించింది. పరిపాలనలో పారదర్శకత పెంచాలని, ప్రజలకు అందుబాటులో ఉంటూ పథకాల అమలులో వేగం పెంచాలని ముఖ్యమంత్రి మంత్రులకు నిర్దేశించారు.

ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా తీసుకుంటున్న కార్యక్రమాల వివరాలు గోప్యంగా ఉంచాలని, క్రమశిక్షణారాహిత్యాన్ని సహించేది లేదని చంద్రబాబు తేల్చిచెప్పారు.

## పీఎన్జీ కనెక్షన్లు వేగవంతం చేయండి..

- మొదటి పేజి తరువాయి

సొమ్మును యథావిధిగా వారి ఖాతాల్లో జమ చేయాలని ప్రభుత్వం ఇప్పటికే నిర్ణయం తీసుకుందని గుర్తుచేశారు. ఈ విషయంపై లబ్ధిదారులకు పూర్తిస్థాయిలో అవగాహన కల్పించాలని, సంబంధిత ఉత్తర్వులను తక్షణమే జారీ చేయాలని అధికారులను ఆదేశించారు. పీఎన్జీ వాడకం సురక్షితమని, చౌక అని ప్రజలకు వివరించాలన్నారు.

**కేంద్రమంత్రికి ఫోన్**

ప్రస్తుతం గృహ అవసరాలకు గ్యాస్ సరఫరాలో ఇబ్బందులను అధిగమించామని, త్వరలోనే పరిస్థితి సాధారణ స్థితికి వస్తుందని అధికారులు సీఎంకు వివరించారు. ఇదే సమయంలో శ్రీకాకుళం-కాకినాడ నేచురల్ గ్యాస్ పైప్‌లైన్ పనుల్లో జాప్యంపై ముఖ్యమంత్రి ఆరా తీశారు.

కేంద్రం నుంచి కొన్ని అనుమతులు రావాల్సి ఉందని అధికారులు చెప్పడంతో, సమీక్ష సమావేశం నుంచే కేంద్ర పెట్రోలియం, సహజ వాయువు శాఖ మంత్రి హర్దీప్ సింగ్ పూరీకి చంద్రబాబు ఫోన్ చేశారు. టెండర్ల ప్రక్రియ పూర్తయినందున, పనులను వేగంగా పూర్తి చేసేలా చర్యలు తీసుకోవాలని కోరారు. దీనికి కేంద్ర మంత్రి సానుకూలంగా స్పందించి, త్వరలోనే సమీక్షించి తగిన చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు.

## నమాజ్ కోసం ఉగ్రవాదులపై దాడిని వాయిదా వేశాం..

భారత ఆర్మీ చీఫ్ జనరల్ ఉపేంద్ర ద్వివేది ఒక కీలక విషయాన్ని వెల్లడించారు. ఉగ్రవాద శిబిరంపై 'ఆపరేషన్ సిందూర్' పేరుతో దాడి చేసేందుకు సిద్ధమైనప్పుడు, అక్కడ ఉగ్రవాదులు నమాజ్ చేస్తున్నారని తెలిసి దాడిని ఉద్దేశపూర్వకంగా వాయిదా వేసినట్లు తెలిపారు. సైనిక లక్ష్యాలతో పాటు మానవతా విలువలకు కూడా ప్రాధాన్యత ఇస్తామని చెప్పడానికి ఇది నిదర్శనమని ఆయన పేర్కొన్నారు. రిషభ్ షా హోస్ట్‌గా వ్యవహరిస్తున్న ఐఐఎంయూఎన్ వారి 'బిఫోర్ ఐ బికేమ్ మీ' అనే పాడ్‌కాస్ట్‌లో జనరల్ ద్వివేది మాట్లాడారు. "మేము ఆ లక్ష్యాలను ఎప్పుడైనా ధ్వంసం చేయవచ్చు. కానీ, అవతలి వైపు ఉగ్రవాద శిబిరంలో వారు నమాజ్ చేస్తున్న సమయంలో దాడి చేయకూడదని నిర్ణయించుకున్నాం. ఎందుకంటే అందరి దేవుడు ఒక్కడే. అందుకే వారు ప్రార్థనలో లేని సమయాన్ని ఎంచుకున్నాం" అని ద్వివేది వివరించారు. ఈ సందర్భంగా తన వ్యక్తిగత జీవితం, నాయకత్వ శైలి గురించి కూడా ఆయన పంచుకున్నారు. సైన్యంలో మహిళల చేరిక, పని వాతావరణం వంటి విషయాల్లో తన కుమార్తెలు మార్గనిర్దేశం చేస్తారని తెలిపారు. "వారు చెప్పే విషయాలను నేను చాలా సీరియస్‌గా తీసుకుంటాను. అవసరమైన

చోట వాటిని అమలు చేస్తాను. వారే నాకు ఈ మార్పులను ఎలా స్వీకరించాలో నేర్పారు" అని ఆయన అన్నారు. తన సైనిక్ స్కూల్, నేషనల్ డిఫెన్స్ అకాడమీ రోజుల గురించి మాట్లాడుతూ, మార్కుల కన్నా వైఖరి, పరిస్థితులకు అనుగుణంగా మారగలగడమే ముఖ్యమని జనరల్ ద్వివేది అభిప్రాయపడ్డారు. "మార్కులు కేవలం చదువులోని ప్రతిభకు సూచిక మాత్రమే, అవి మీ వ్యక్తిత్వాన్ని నిర్ధారించలేవు" అని ఆయన వ్యాఖ్యానించారు. అత్యంత క్లిష్టమైన కౌంటర్ టెర్రరిజం ఆపరేషన్లలో నైతిక సందిగ్ధత ఎదురైనప్పుడు, ప్రశాంతంగా నిర్ణయాలు తీసుకోవడానికి భగవద్గీత, ఇతర ఆధ్యాత్మిక గ్రంథాలు ఎంతగానో సహాయపడతాయని జనరల్ ద్వివేది తెలిపారు.

## ట్రెండ్ ను ఫాలో కావొద్దు... సవాళ్లను స్వీకరించండి

- మొదటి పేజి తరువాయి

ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా విద్యార్థులను ఉద్దేశించి స్ఫూర్తిదాయక ప్రసంగం చేశారు. షార్ట్‌కట్‌లతో నిండిన ప్రస్తుత ప్రపంచంలో నైతికతే గొప్ప బలమని లోకేశ్ అన్నారు. "కేవలం ఏం నేర్చుకున్నారన్నది కాకుండా, ఎలా ఆలోచిస్తున్నారనేదే అత్యంత ముఖ్యం. ఎవరూ చూడనప్పుడు మనం ఎలా ప్రవర్తిస్తామో అదే మన నిజమైన వ్యక్తిత్వాన్ని తెలియజేస్తుంది" అని విద్యార్థులకు హితవు పలికారు. లక్ష్య సాధనలో పట్టుదలతో ఉండాలని, ఎదురయ్యే అడ్డంకులను అవకాశాలుగా మార్చుకోవాలని సూచించారు. ఈ పర్యటన సందర్భంగా మంత్రి లోకేశ్ కీలక ప్రకటన చేశారు. ప్రముఖ రియల్ ఎస్టేట్ సంస్థ సత్వా గ్రూప్ ఆధ్వర్యంలో ఈ పాఠశాల నడుస్తోందని, త్వరలోనే ఈ సంస్థ ఆంధ్రప్రదేశ్, ముఖ్యంగా విశాఖపట్నం అభివృద్ధిలో భాగస్వామ్యం కాబోతోందని వెల్లడించారు. గ్రీన్‌వుడ్ హై స్కూల్ అంతర్జాతీయ స్థాయిలో పౌరులను (గ్లోబల్ సిటిజన్స్) తయారు చేస్తుండటం గర్వకారణమని ఆయన ప్రశంసించారు.

అంతకుముందు, పాఠశాల ప్రాంగణానికి చేరుకున్న మంత్రి లోకేశ్ కు నిర్వాహకులు ఘనంగా స్వాగతం పలికారు. అనంతరం

ఆయన స్కూల్‌లోని స్పోర్ట్స్ కాంప్లెక్స్, ఆర్ట్ గ్యాలరీ, తరగతి గదులను సందర్శించారు. జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించిన లోకేశ్, గ్రాడ్యుయేషన్ పూర్తి చేసుకున్న విద్యార్థులకు సర్టిఫికెట్లు ప్రదానం చేసి అభినందనలు తెలిపారు. విద్యార్థుల గౌరవ వందనం స్వీకరించి, వారితో కలిసి గ్రూప్ ఫోటో దిగారు.

### నవ రాయ్‌పూర్‌ను ఉదాహరణగా చూపుతూ

## అమరావతిపై సజ్జల విమర్శలు

- మొదటి పేజి తరువాయి

పరిస్థితి కూడా అలాగే మారుతుందని ఆయన హెచ్చరించారు.కేవలం ఎమ్మెల్యేలు, మంత్రులు, ఐఏఎస్ అధికారులు, జడ్జిల కోసం విలాసవంతమైన బంగ్లాలు కడుతున్నారే తప్ప, సామాన్య ప్రజలు అక్కడ నివసించే పరిస్థితి లేదని ధ్వజమెత్తారు. జూబ్లీహిల్స్, బంజారాహిల్స్ స్థాయిలో రేట్లు పెట్టి... ఎటువంటి మౌలిక సదుపాయాలు లేని చోటికి ప్రజలు ఎందుకు వస్తారని సజ్జల ప్రశ్నించారు.చంద్రబాబు అమరావతిని ఒక 'గ్రోత్ ఇంజిన్'లా కాకుండా, తన అవినీతికి తరగని గనిలా, అక్షయపాత్రలా వాడుకుంటున్నారని సజ్జల ఆరోపించారు. రాజధాని పేరుతో లక్షల కోట్ల రూపాయల అప్పులు తీసుకురావడం భావితరాలకు అన్యాయం చేయడమేనని మండిపడ్డారు. తన సొంత సంస్థ హెరిటేజ్‌ను నడిపేటప్పుడు తీసుకునే ఆర్థిక జాగ్రత్తలను, రాజధాని నిర్వహణలో చంద్రబాబు ఎందుకు పాటించడం లేదని నిలదీశారు. అప్పుల ద్వారా వచ్చే నిధులతో ఆకాశహర్మ్యాలు కట్టడం వల్ల రాష్ట్రానికి ఆదాయం ఎలా వస్తుందో చంద్రబాబు సూటిగా సమాధానం చెప్పలేకపోతున్నారని, ఆయన మాటల్లో డొల్లతనం కనిపిస్తోందని విమర్శించారు. మరోవైపు వైసీపీ అధినేత జగన్ ప్రతిపాదించిన మావిగన్ రాజధాని గురించి సజ్జల ప్రస్తావిస్తూ, అమరావతికి అయ్యే ఖర్చులో కేవలం 10 శాతంతోనే మరుసటి రోజు నుంచే పూర్తిస్థాయి రాజధానిగా మార్చవచ్చని తెలిపారు. మావిగన్ ప్రాంతం అంతర్జాతీయ విమానాశ్రయం, రైల్వే కనెక్టివిటీ, పోర్టుతో అనుసంధానం అయిందని, అక్కడ పెట్టుబడి పెడితే తక్షణమే ఫలితం ఉంటుందని వివరించారు.

రాష్ట్ర వనరులను సక్రమంగా వినియోగించుకోవాలన్నదే జగన్ ఆలోచన అని, కానీ చంద్రబాబు కేవలం భ్రమలు సృష్టిస్తూ ప్రజలను మోసం చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇప్పటికైనా వృథా ఖర్చులను ఆపి, ఆచరణాత్మకమైన రాజధాని వైపు అడుగులు వేయాలని సజ్జల సూచించారు.

## యూపీలో పడవ బోల్తా... 10 మంది మృతి...

- మొదటి పేజి తరువాయి

ఈ క్రమంలో పడవ అదుపుతప్పి నదిపై ఉన్న ఫ్లోటింగ్ పాంటూన్ వంతెన (పైపా బ్రిడ్జి)ను ఢీకొట్టింది. దీంతో పడవ ఒక్కసారిగా నీటిలో మునిగిపోయింది. సామర్థ్యానికి మించి ప్రయాణికులను ఎక్కించడం వల్లే ఈ దుర్ఘటన జరిగిందని ప్రత్యక్ష సాక్షులు తెలిపారు.ప్రమాద సమాచారం అందిన వెంటనే పోలీసులు, అగ్నిమాపక సిబ్బంది, స్థానిక గజ ఈతగాళ్లు ఘటనా స్థలానికి చేరుకుని సహాయక చర్యలు చేపట్టారు. ఇప్పటివరకు 14 మందిని కాపాడి ఆసుపత్రికి తరలించగా, 10 మృతదేహాలను వెలికితీశారు. గల్లంతైన వారి కోసం ఎన్‌డీఆర్ఎఫ్, ఎస్‌డీఆర్ఎఫ్ బృందాలు యమునా నదిలో తీవ్రంగా గాలిస్తున్నాయి.ఈ దుర్ఘటనపై ప్రధాని నరేంద్ర మోదీ, యూపీ ముఖ్యమంత్రి యోగి ఆదిత్యనాథ్ తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. మృతుల కుటుంబాలకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. సహాయక చర్యలను వేగవంతం చేయాలని, బాధితులకు మెరుగైన వైద్యం అందించాలని సీఎం యోగి అధికారులను ఆదేశించారు. స్థానిక యంత్రాంగం బాధితులకు అన్ని విధాలా అండగా నిలుస్తోందని ప్రధాని మోదీ ట్వీట్ చేశారు. గల్లంతైన వారి కోసం గాలింపు చర్యలు కొనసాగుతుండటంతో మృతుల సంఖ్య పెరిగే అవకాశం ఉందని అధికారులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

### భాగ్యనగరంలో 'ప్రేమ' ముసుగులో

## మతం మార్పిడి దందా

- మొదటి పేజి తరువాయి

వంచన ఉదంతం నగరంలో తీవ్ర కలకలం రేపుతోంది. ప్రేమ పేరుతో వల వేయడం, ఆపై మతం మార్చుకోవాలంటూ తీవ్రస్థాయిలో వేధింపులకు గురిచేస్తున్న ఇద్దరు అన్నదమ్ముల వ్యవహారం ఇప్పుడు చర్చనీయాంశంగా మారింది. జమీర్, అతని తమ్ముడు మిరాజ్ కలిసి ఒక పక్కా ప్రణాళికతో అమాయక యువతులను ట్రాప్ చేస్తున్నట్లు పోలీసుల ప్రాథమిక విచారణలో వెల్లడైంది. ఈ అన్నదమ్ములు ఇద్దరూ ఇప్పటివరకు సుమారు ఐదుగురు హిందూ యువతులను ప్రేమ పేరుతో నమ్మించి, వారి జీవితాలతో ఆడుకున్నట్లు తీవ్ర ఆరోపణలు వస్తున్నాయి.నిందితుల్లో ఒకరైన జమీర్‌పై గతంలోనే పంజాగుట్ట పోలీస్ స్టేషన్‌లో పోక్సో చట్టం కింద కేసు నమోదై ఉండటం గమనార్హం. ఒక మైనర్ బాలికను వేధించిన కేసులో జైలుకు వెళ్లి వచ్చినా, అతని ప్రవర్తనలో ఎలాంటి మార్పు రాలేదని పోలీసులు గుర్తించారు. జైలు నుంచి బయటకు వచ్చిన తర్వాత జమీర్ తన తమ్ముడు మిరాజ్‌తో కలిసి ఈ అరాచకాలను మరింత ముమ్మరం చేశాడు. తాజాగా మరో యువతిని తన ప్రేమ వలలో వేసుకున్న జమీర్, ఆమెను లొంగదీసుకున్న తర్వాత అసలు స్వరూపాన్ని బయటపెట్టాడు. సదరు యువతిపై అఘాయిత్యానికి పాల్పడటమే కాకుండా, ఆమెను తమ మతంలోకి మారాలని బలవంతం చేస్తూ తీవ్రమైన ఒత్తిడికి గురిచేశాడు. ఒకవేళ ఈ విషయాన్ని ఎవరికైనా చెబితే ప్రాణాలు తీస్తామంటూ అన్నదమ్ములిద్దరూ కలిసి బాధితురాలిని బ్లాక్ మెయిలింగ్ చేసినట్లు సమాచారం.బాధితురాలు ధైర్యంగా ముందుకు వచ్చి ఫిర్యాదు చేయడంతో ఈ అన్నదమ్ముల గుట్టు రట్టయింది. రంగంలోకి దిగిన పంజాగుట్ట పోలీసులు నిందితులపై వివిధ సెక్షన్ల కింద కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు. ఈ అన్నదమ్ములు కేవలం ఇద్దరే ఇలాంటి అక్రమాలకు పాల్పడుతున్నారా లేక వీరి వెనుక ఏదైనా పెద్ద ముఠా ఉందా అనే కోణంలో పోలీసులు లోతుగా ఆరా తీస్తున్నారు. బాధితుల సంఖ్య ఇంకా పెరిగే అవకాశం ఉండటంతో, నిందితుల నుంచి ప్రాణహాని ఉన్న యువతులకు రక్షణ కల్పించేందుకు పోలీసులు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నారు. నగర నడిబొడ్డున మతం మార్పిడి లక్ష్యంగా జరుగుతున్న ఇటువంటి దాడులు స్థానిక ప్రజలను భయాందోళనకు గురిచేస్తున్నాయి.

### భోగాపురం విమానాశ్రయం

## ప్రారంభోత్సవానికి మోదీకి ఆహ్వానం!

ఉత్తరాంధ్ర ప్రజల దశాబ్దాల కల, ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ప్రతిష్ఠాత్మక ప్రాజెక్టు అయిన భోగాపురం అంతర్జాతీయ విమానాశ్రయం (అల్లూరి సీతారామరాజు అంతర్జాతీయ విమానాశ్రయం) ప్రారంభోత్సవానికి ముహూర్తం ఖరారవుతోంది. ఈ మెగా ప్రాజెక్టును జాతికి అంకితం చేయాల్సిందిగా కోరుతూ ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రధానమంత్రి మోదీకి అధికారికంగా ఆహ్వానం పంపారు. ప్రధాని షెడ్యూల్ లభ్యతను బట్టి జూలై 5 లేదా 8వ తేదీల్లో ఒక రోజును, లేనిపక్షంలో ఆగస్టు 17 లేదా 19 తేదీల్లో మరొక తేదీని ప్రారంభోత్సవానికి కేటాయించాలని ఏపీ ప్రభుత్వం విజ్ఞప్తి చేసినట్లు సమాచారం.ప్రస్తుతం ఈ విమానాశ్రయ పనులు తుది దశకు చేరుకున్నాయి. సుమారు 98 శాతం పనులు ఇప్పటికే పూర్తవ్వగా, మిగిలిన ఫినిషింగ్ పనులను జూన్ 30వ తేదీ నాటికి పూర్తి చేయాలని ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుంది. ఇందుకోసం అదనపు సిబ్బందిని మోహరించి రాత్రింబవళ్లు యుద్ధ ప్రాతిపదికన పనులు కొనసాగిస్తున్నారు. ఈ అంతర్జాతీయ విమానాశ్రయం అందుబాటులోకి వస్తే ఉత్తరాంధ్ర రూపురేఖలు మారిపోవడమే కాకుండా... పర్యాటక, పారిశ్రామిక రంగాలు కొత్త పుంతలు తొక్కుతాయని నిపుణులు భావిస్తున్నారు. ఇప్పటికే ఈ విమానాశ్రయాన్ని కస్టమ్స్ ఎయిర్‌పోర్ట్‌గా కేంద్రం నోటిఫై చేయగా, అంతర్జాతీయ విమానాల రాకపోకలకు అవసరమైన ఇమ్మిగ్రేషన్ హోదాను కూడా త్వరితగతిన పూర్తి చేయాలని ఏపీ ప్రభుత్వం కేంద్రాన్ని కోరింది.

## లొంగిపోయిన 42 మంది మావోయిస్టులు.. కీలక వ్యాఖ్యలు చేసిన తెలంగాణ డీజీపీ

- మొదటి పేజి తరువాయి

వంటి కీలక నేతలు ఉండటం విశేషం. ఈ సందర్భంగా డీజీపీ మాట్లాడుతూ, గత ఏడాదిన్నర కాలంలోనే మొత్తం 763 మంది మావోయిస్టులు హింసా మార్గాన్ని వీడి ప్రభుత్వానికి లొంగిపోయారని వెల్లడించారు. ఛత్తీస్‌గఢ్ సరిహద్దు ప్రాంతాల్లో పోలీసుల కూంబింగ్ కార్యకలాపాలు ముమ్మరం కావడంతో, తమ రక్షణ కోసం మావోయిస్టులు తెలంగాణ పోలీసులను ఆశ్రయిస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు. లొంగిపోయిన వారిలో అత్యధికులు ఛత్తీస్‌గఢ్ రాష్ట్రానికి చెందిన వారేనని, తెలంగాణకు చెందిన వారు కేవలం ఒక్కరే ఉన్నారని డీజీపీ స్పష్టం చేశారు. ఒకప్పుడు సెంట్రల్ కమిటీ, స్టేట్ కమిటీల్లో తెలంగాణ వాసుల ప్రాతినిధ్యం ఎక్కువగా ఉండేదని, కానీ ప్రస్తుతం ఆ సంఖ్య గణనీయంగా తగ్గిపోయిందని ఆయన వివరించారు. సెంట్రల్ కమిటీలో 11 మంది నుంచి ఇద్దరు, స్టేట్ కమిటీలో 24 మంది నుంచి కేవలం ఇద్దరు మాత్రమే మిగిలారని, వారు కూడా త్వరలోనే లొంగిపోవాలని ఆయన పిలుపునిచ్చారు. లొంగిపోయిన 42 మందికి పునరావాస ప్యాకేజీ కింద రూ. 1.93 కోట్ల నగదును అందజేయడంతో పాటు, ముఖ్యమంత్రి ఆదేశాల మేరకు వారికి ప్రత్యేక ఆరోగ్య కార్డులను కూడా జారీ చేయనున్నట్లు డీజీపీ వెల్లడించారు. ప్రభుత్వం కల్పిస్తున్న ఈ పునరావాస అవకాశాలను అందిపుచ్చుకుని, అడవి బాట పట్టిన వారంతా తిరిగి రావాలని పోలీసులు విజ్ఞప్తి చేస్తున్నారు.

## నాతవరం బీసీ కాలనీలో శ్రీ శ్రీ శ్రీ బాల వరసిద్ధి వినాయక విగ్రహ ప్రతిష్ట వాస్తు హోమం.........

**నాతవరం,పెన్ పవర్ (ఏప్రిల్ 10):** నాతవరం బీసీ కాలనీ లో గల శ్రీ శ్రీశ్రీ బాల వరసిద్ధి వినాయక విగ్రహ ప్రతిష్ట లో భాగంగా శుక్రవారం వేద పండితులచే విగ్రహ ప్రతిష్ట,వాస్తు హోమాన్ని వేదమంత్రాలతో శుక్రవారం మధ్యాహ్నం నుండి ప్రారంభించారు. రెండవ రోజు శనివారం వివిధ పూజా కార్యక్రమాలు,అభిషేకాలు,హోమాలు స్వామివారికి చేసి ఆదివారం విగ్రహ ప్రతిష్ట,భారీ అన్న సమారాధన కార్యక్రమాన్ని ఉత్సవ కమిటీ నిర్వాహకులు ఏర్పాటు చేయడం జరుగుతుంది అన్నారు.భక్తులందరూ అధిక సంఖ్యలో పాల్గొని స్వామివారి తీర్థప్రసాదాలు స్వీకరించాలని కమిటీ వారు తెలిపారు.



పెన్ పవర్
ఉత్తరాంధ్ర
శ్రీకాకుళం | మన్యం | విజయనగరం | విశాఖపట్నం | అనకాపల్లి | అల్లూరి జిల్లా

# చేయి చేయి కలిపి రహదారి నిర్మించిన గిరిజనులు

## ప్రభుత్వ సహాయం లేకపోయినా శ్రమదానంతో ఆదర్శం





**స్టాప్ రిపోర్టర్,గూడెం కొత్తవీధి, కొయ్యూరు,పెన్ పవర్,ఏప్రిల్ 10:** గ్రామం ఏర్పడి నాలుగు దశాబ్దాలు దాటినా రహదారి సౌకర్యం లేక ఇబ్బందులు పడుతున్న గిరిజనులు చివరకు స్వయంగా ముందుకొచ్చి మట్టి రహదారి నిర్మించుకున్నారు. అల్లూరి సీతారామరాజు జిల్లా కొయ్యూరు మండలం బూదరాళ్ల పంచాయతీ పరిధిలోని నల్లబెల్లి గ్రామానికి ఈ ఘటన ప్రేరణగా నిలుస్తోంది.గ్రామంలో రహదారి లేకపోవడంతో ప్రజలు ఎక్కడికైనా వెళ్లాలంటే కాలినడకనే ఆధారపడాల్సి వచ్చేది. ముఖ్యంగా అనారోగ్య సమయంలో బాధితులను డోలుమోతల ద్వారా ఆసుపత్రికి తరలించాల్సిన దుస్థితి నెలకొంది. రహదారి కోసం పలుమార్లు అధికారులను, ప్రజాప్రతినిధులను సంప్రదించినప్పటికీ ఫలితం లేకపోవడంతో గ్రామస్తులు నిరాశకు గురయ్యారు.ఇక ఎదురు చూడటం వ్యర్థమని భావించిన గిరిజనులు సమావేశమై స్వయంగా రహదారి నిర్మించుకోవాలని నిర్ణయించారు. ఈ మేరకు మూడు రోజుల పాటు శ్రమదానం చేసి పలుగు, పారలతో మట్టి రహదారిని నిర్మించారు. “ఎవరైనా మా సమస్యను పరిష్కరిస్తారని ఆశించి మోసపోయాం. అందుకే మేమే ముందుకు వచ్చాం” అని స్థానిక గిరిజనుడు శివకుమార్ తెలిపారు.గిరిజనులు ఏకమై స్వయంకృషితో రహదారి నిర్మించుకోవడం పలువురి ప్రశంసలు అందుకుంటోంది. ప్రభుత్వ సహాయం లేకపోయినా తమ సమస్యకు తామే పరిష్కారం కనుగొన్న ఈ గ్రామస్తులు ఇతరులకు ఆదర్శంగా నిలుస్తున్నారు.



# ప్రజా సమస్యలపై ఎమ్మెల్యే గంటా ఫోకస్

### పీజీఆర్ఎస్ ఫిర్యాదులపై నేరుగా సమీక్ష



**బిమిలి, పెన్ పవర్, ఏప్రిల్ 10 :** ప్రజా సమస్యల పరిష్కారానికి ప్రాధాన్యం ఇస్తూ భీమిలి ఎమ్మెల్యే మధురవాడ జోనల్ కార్యాల యంలో శుక్రవారం ప్రత్యేకంగా నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదికలో పాల్గొన్నా రు. వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన ప్రజల విన తులను స్వీకరించి, సంబంధిత అధికారులతో చర్చించారు.ఈ సందర్భంగా గతంలో పీజీఆర్ఎ స్ ద్వారా పరిష్కరించామని నమోదైన ఫిర్యా దులపై ఎమ్మెల్యే స్వయంగా ఫిర్యాదిదారులతో ఫోన్ ద్వారా మాట్లాడి నిజస్థితిని తెలుసుకున్నా రు. వీధి దీపాలు వెలగకపోవడం డిబ్రిస్ తొలగిం పు లేకపోవడం, సుందరయ్య పార్కులో లైట్లు పనిచేయకపోవడం వంటి సమస్యలపై ఇచ్చిన ఫిర్యాదులు పరిష్కారమయ్యాయా అని ప్రశ్నిం చగా, సంబంధిత ఫిర్యాదిదారులు సమస్యలు పరిష్కారమయ్యాయని తెలిపారు.అయితే, దివ్యాంగ పెన్షన్‌కు సంబంధించిన ఫిర్యాదు ఇంకా పరిష్కారం కాలేదని కరిమిరెడ్డి సాయికు మార్ ఎమ్మెల్యే దృష్టికి తీసుకువచ్చారు. దీనిపై వెంటనే చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు.ఇక రహదారులు, డ్రెయినేజీ, విద్యుత్ వంటి మౌలిక సదుపాయాల సమస్య లపై కూడా ప్రజలు పలు వినతిపత్రాలు సమ ర్పించారు. కార్యక్రమంలో జోనల్ కమిషనర్ అయ్యప్ప నాయుడు, డీసీపీ వెంకటేశ్వరరావు, కూటమి నాయకులు మరియు స్థానిక ప్రజాప్రతి నిధులు పాల్గొన్నారు.

# లబ్బూరు పిహెచ్సిలో ఘనంగా పక్వాడ పోషణ పక్షోత్సవం



ఐసిడిఎస్ సిడిపిఓ యు విమల కుమారి.

**ముంచంగిపుట్టు, పెన్ పవర్, ఏప్రిల్ 10.** మండలంలో లబ్బూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో 8వ పోషణ పక్వాడ పక్షోత్సమును ఘనంగా నిర్వహించినట్లు మండల ఐసిడిఎస్ ప్రాజెక్ట్ అధికారిని యు విమల కుమారి తెలిపారు. ఈ సందర్భంగా శుక్రవారం ఆమె మాట్లాడుతూ.. పుట్టినది మొదలుకొని 6 సంవత్సరముల పిల్లలో మెదడు అభివృద్ధికి పౌష్టికాహారని అందించాలని ఉద్దేశంతో పోషణ పక్వాడా కార్యక్రమం నిర్వహిస్తున్నమన్నారు. బిడ్డకు తల్లి గర్భం నుండే తగినటువంటి పోషణ అందించాలని తెలియజేశారు. ఎదుగుతున్న పిల్లలకు మొబైల్ స్క్రీన్ టైం తగ్గించాలని, శారీరక అభివృద్ధి కలిగేటట్టుగా పిల్లల్ని ఆడించాలని, తల్లిదండ్రులు కుటుంబ పెద్దలు పిల్లలతో కథలు చెబుతూ వారిని బొమ్మలతో ఆడుకొనిస్తూ చక్కని అభివృద్ధికి తోడ్పడే విధంగా అవగాహన కలిగి ఉండాలని తెలియజేశారు. అదేవిధంగా వనగుమ్మ పంచాయతీలోను కార్యక్రమం పోషణ్ పక్వాడ కార్యక్రమం నిర్వహించినట్లు సిడిపిఓ తెలిపారు. ఈ కార్యక్రమంలో ఐసిడియస్ సూపర్వైజర్లు, అంగన్వాడీ కార్యకర్తలు, ఆశ వర్కర్లు, గ్రామ పెద్దలు, గ్రామస్తులు, ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

# బైబిల్ కాలేజ్ లో ఎనిమిదవ గ్రాడ్యుయేషన్ వేడుకలు






**గాజువాక :పెన్ పవర్, ఏప్రిల్ 10:** 72వ వార్డు సమత నగర్లో విశాఖ వ్యాలీ బైబిల్ కాలేజ్ ఎనిమిదవ గ్రాడ్యుయేషన్ వేడుకలు ఘనంగా జరిగాయి. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా 72వ వార్డ్ వైఎస్ఆర్సిపి ఇన్చార్జ్ సిరట్ల శ్రీనివాస్ హాజరయ్యారు. 20 మంది గ్రాడ్యుయేట్స్ కి మెడల్స్ అందజేశారు. కీత్ చేతుల మీదుగా సర్టిఫికెట్స్, సమతా నగర్ కాలనీ ప్రెసెంట్ హిమంత్ చేతుల మీదుగా గ్రాడ్యుయేషన్ రింగ్ అందజేశారు . విశాఖ వ్యాలీ బైబిల్ కాలేజ్ అధినేత జాన్ డీన్ ఎంతోమంది పేదవారికి చదువు చెప్పిండమే కాకుండా స్వయం ఉపాధి ద్వారా ఈరోజు 15 మందికి కుట్టు మిషన్లు పంపిణీ నా ద్వారా చేయడం చాలా ఆనందంగా ఉందని వాసు అన్నారు. జాన్ డీన్ మాట్లాడుతూ విశాఖ వ్యాలీ బైబిల్ కాలేజ్ మరియు స్కూల్ ఇప్పటికీ కొన్ని వేల మందికి చదువు చెప్పడమే కాకుండా స్వయం ఉపాధి కింద కుట్టు మిషన్ శిక్షణ మరియు ఎలక్ట్రిషన్ వర్క్ నేర్పించడం కూడా జరుగుతుందని చెప్పారు. ఈ కార్యక్రమంలో రోటరీ క్లబ్ ప్రెసిడెంట్ సత్యవాణి, పి ఎస్ ఆర్ రియల్ ఎస్టేట్ అధినేత శంకర్రావు, నేషనల్ బాడీ బిల్డర్ రాజారావు తదితరులు పాల్గొన్నారు.

# దోమతెరల వినియోగంపై అవగాహన.



ఎంపీడీవో సిహెచ్ సీతామహాలక్ష్మి.

**చింతపల్లి పెన్ పవర్ ఏప్రిల్ 10.** దోమతెరల వినియోగంపై మండలంలో ఎంపీడీవో సిహెచ్ సీతామహాలక్ష్మి అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గిరిజనులు మలేరియా వంటి రోగాలకు దూరంగా ఉండేందుకు దోమతెరలను వినియోగించాలని అన్నారు. లంబసింగి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలోని చింతలూరు గ్రామ గిరిజనులకు దోమతెరలను ఎంపీడీవో వైద్య ఆరోగ్య శాఖ సిబ్బందితో కలిసి పంపిణీ చేశారు. గత ఏడాది మలేరియా పాజిటివ్ కేసులు నమోదైన గ్రామాల గిరిజనులకు రాష్ట్ర ప్రభుత్వం దోమతెరలను పంపిణీ చేస్తుందన్నారు తొలివిడతగా లంబసింగి పిహెచ్సి పరిధిలోని 37 గిరిజన గ్రామాలకు 3600 దోమతెరలు వచ్చాయన్నారు. కుటుంబంలో సభ్యుల సంఖ్య ఆధారంగా ఒకటి నుంచి నాలుగు దోమతెరలు పంపిణీ చేస్తున్న మన్నారు. గిరిజనులు రాత్రివేళ పడుకునే సమయంలో దోమతెరలను వినియోగించాలన్నారు. దోమతెరలు వినియోగించడం వల్ల కలిగే వ్యాధులకు దూరంగా ఉండవచ్చును అన్నారు. గ్రామాల్లో జ్వరాలు ప్రబలితే వెంటనే పీహెచ్సీ కి వచ్చి మెరుగైన వైద్యం చేయించుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ ఎంపీడీవో బిఏబిఎల్ మూర్తి మలేరియా సబ్ యూనిట్ అధికారి బుక్క చిట్టిబాబు, ఎం టి ఎస్ గుమ్మా యుగంధర్ వైద్యాధికారి బి దినేష్ ఎంపీ హెచ్ఈఓ హెచ్ ఎన్ జి వెంకటేశ్వర్లు హెచ్ ఎ . శ్రీధర్, ఆశ, ఏఎన్ఎం లు పాల్గొన్నారు.




# ప్రభుత్వ భూమి ఆక్రమణ ఆరోపణలు

### 33వ వార్డులో ఉద్రిక్తత, విచారణకు డిమాండ్

**విశాఖ దక్షిణం పెన్ పవర్ ఏప్రిల్ 10 :** దక్షిణ నియోజకవర్గం 33వ వార్డులో ప్రభుత్వ భూమి ఆక్రమణకు సంబంధించిన ఆరోపణలు రాజకీయంగా దుమారం రేపుతున్నాయి. జనసే న పార్టీకి చెందిన మాజీ కార్పొరేటర్ కుటుంబ సభ్యుడు జీ.కే గోపాలకృష్ణ పై సుమారు రూ.10 కోట్ల విలువైన ప్రభుత్వ స్థలాన్ని ఆక్రమించి, 500 గజాల్లో అనధికారికంగా షెడ్ నిర్మించినట్లు వైసీపీ నేతలు ఆరోపిస్తున్నారు.ఈ వ్యవహారంపై మాజీ ఎమ్మెల్యే, దక్షిణ నియోజకవర్గ సమన్వ యకర్త వాసుపల్లి గణేష్ కుమార్ ఆగ్రహం వ్యక్తం చేశారు. స్థానిక వైసీపీ శ్రేణులతో కలిసి నీలమ్మ వేపచెట్టు సమీపంలోని ఎంజీఎం పాఠశాల దగ్గర ఉన్న ఆక్రమిత స్థలం వద్ద శుక్రవారం ర్యాలీ నిర్వ హించి ధర్నా చేపట్టారు.





వాసుపల్లి మాట్లాడుతూ, ఈ భూమిపై అక్రమం గా షెడ్ నిర్మించి వ్యాయామశాల పేరుతో యువ త నుంచి డబ్బులు వసూలు చేస్తున్నారని ఆరో పించారు. అంతేకాకుండా, జీవీఎంసీ నీరు మరి యు విద్యుత్తును కూడా అనధికారికంగా విని యోగిస్తున్నారని పేర్కొన్నారు. ఈ అంశంపై ఇప్పటికే కలెక్టర్ గ్రీవెన్స్‌లో ఫిర్యాదు చేసినప్పటి కీ అధికారుల నుంచి స్పందన రాలేదని తెలిపారు. ఈ నేపథ్యంలో వెంటనే పూర్తి స్థాయి విచారణ చేపట్టి, బాధ్యులపై చట్టపరమైన చర్యలు తీసు కోవాలని ఆయన డిమాండ్ చేశారు. ప్రభుత్వ భూముల రక్షణలో నిర్లక్ష్యం వహిస్తే మరింత తీవ్ర ఆందోళనలు చేపడతామని హెచ్చరించా రు.

# పీ-4 తో పేదరికంపై గెలుపు యాత్ర





**విశాఖలో 66 వేల కుటుంబాలకు మార్గదర్శకుల అండ**

**విశాఖ దక్షిణం, పెన్ పవర్, ఏప్రిల్ 10 :**పేదరికం లేని సమాజ నిర్మాణ లక్ష్యంతో రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న పీ-4 కార్యక్రమం విశాఖపట్నం జిల్లాలో ఆదర్శవంతమైన ఫలితా లను అందిస్తోంది. ముఖ్యమంత్రి నారా చంద్రబా బు నాయుడు పిలుపునకు స్పందనగా వేలాది మంది సామాజిక సేవకులు ముందుకు రావడం ఈ కార్యక్రమ విజయానికి ప్రధాన కారణంగా నిలుస్తోంది.జిల్లాలో ఇప్పటివరకు 7,539 మంది మార్గదర్శకులు పీ-4లో చేరి, 66,103 పేద కుటుంబాలను దత్తత తీసుకున్నారు. ప్రభుత్వం తో పాటు ప్రైవేట్ సంస్థలు, వ్యక్తులు కలిసి సు మారు రూ.20.86 కోట్ల సహాయాన్ని అందించ డం ద్వారా పేదరిక నిర్మూలనకు బలమైన పునా ది వేశారు.ఇటీవల నిర్వహించిన పీ-4 వార్షిక మహోత్సవంలో విశేష సేవలు అందించిన 20 మంది దాతలను జిల్లా ఇన్‌చార్జి మంత్రి డోలా శ్రీబాల వీరాంజనేయ స్వామి, స్థానిక ప్రజాప్రతి నిధులు, జిల్లా కలెక్టర్ అభినందించి సత్కరించా రు.

**సంస్థల సేవలు ప్రత్యేకం**

విశాఖ జిల్లాలో అనేక సంస్థలు పీ-4 కార్యక్రమం లో భాగస్వామ్యమై ఆరోగ్యం, విద్య, మౌలిక స దుపాయాల అభివృద్ధికి విశేషంగా సహకరిస్తు న్నాయి.దివిస్ ఫౌండేషన్ చిప్పాడ గ్రామాన్ని దత్తత తీసుకుని రూ.7 కోట్లతో అభివృద్ధి కార్య క్రమాలు చేపట్టింది. హెచ్‌బీఎల్ ఇంజనీరింగ్ అంగన్‌వాడీ కేంద్రాల్లో మౌలిక వసతులు కల్పిం చగా, లుపిన్ ఫౌండేషన్ ఆసుపత్రి అభివృద్ధికి నిధులు అందించింది.

స్నిగ్ధ శ్రీదేవి ఫౌండేషన్ స్కిల్ డెవలప్‌మెంట్, ఆరోగ్య అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తోం ది. ఎన్‌టీపీసీ కింగ్ జార్జ్ ఆసుపత్రికి ఆధునిక వైద్య పరికరాలు అందించగా, ఐఓసిఎల్, కోర మాండల్ వంటి సంస్థలు కోట్ల రూపాయలతో ఆరోగ్యం, విద్య రంగాలకు మద్దతు అందించా యి.

నాల్కో క్షయవ్యాధి రోగులకు పోషకాహార కిట్లు అందించగా, హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్ ఐటీ మౌలిక వసతులకు నిధులు సమకూర్చింది. అదానీ గంగవరం పోర్ట్ కలెక్టరేట్ భవన మరమ్మత్తులకు సహాయం చేసింది.

**యువత, మహిళల అభివృద్ధికి ప్రాధాన్యం**

మాజిక్ బస్ వంటి సంస్థలు యువతకు శిక్షణ ఇచ్చి ఉద్యోగ అవకాశాలు కల్పించడంలో కీలక పాత్ర పోషిస్తున్నాయి. వివిధ ఫౌండేషన్లు మహి ళా సంక్షేమం, స్వయం ఉపాధి, విద్యాభివృద్ధి కార్యక్రమాలను నిర్వహిస్తూ సమాజంలో సాను కూల మార్పులకు దోహదపడుతున్నాయి.

**ప్రజా భాగస్వామ్యమే విజయ రహస్యం**

ఈ కార్యక్రమంపై జిల్లా ఇన్‌చార్జి మంత్రి డోలా బాల వీరాంజనేయ స్వామి మాట్లాడుతూ, "పీ-4లో వేలాది మంది మార్గదర్శకులు భాగ స్వామ్యం కావడం గర్వకారణం. జిల్లాలో గుర్తిం చిన లక్షన్నర పేద కుటుంబాల్లో ఇప్పటికే పెద్ద సంఖ్యలో దత్తత పూర్తవ్వడం సంతోషకరం. మిగిలిన కుటుంబాలకు కూడా సహాయం అం దించేందుకు మరింత మంది ముందుకు రావాలి" అని అన్నారు.

ప్రభుత్వ మార్గదర్శకత్వం, అధికారులు సమన్వయం, దాతల ఉదారత కలిసివచ్చిన ప్పుడు సమాజంలో స్థిరమైన మార్పులు సాధ్య మవుతాయని పీ-4 కార్యక్రమం స్పష్టంగా చాటుతోంది.

## లోతుగడ్డ పంచాయతీలో పర్యటించిన బూత్ అబ్జర్వర్ పసుపులేటి నాగమణి



**గూడెం కొత్తవీధి/చింతపల్లి,పెన్ పవర్, ఏప్రిల్ 10:**అల్లూరి సీతారామరాజు జిల్లా, చింతపల్లి మండలం లోతుగడ్డ పంచాయతీలో బూత్ అబ్జర్వర్‌గా నియమితులైన గూడెం కొత్తవీధి మండల తెలుగుదేశం పార్టీ ప్రధాన కార్యదర్శి,జీకే వీధి ఎంపీటీసీ పసుపులేటి నాగమణి లోతుగడ్డ పంచాయతీలోని 67, 68 బూత్‌ల పరిధిలో పర్యటించారు. ఈ సందర్భంగా ఆమె తెలుగుదేశం పార్టీ నాయకులు, కార్యకర్తలతో సమావేశమై పార్టీ బలోపేతంపై చర్చించారు. అధిష్టానం ఆదేశాల మేరకు పార్టీని క్షేత్రస్థాయిలో మరింత పటిష్టంగా నిలబెట్టేందుకు ప్రతి కార్యకర్త కృషి చేయాలని ఆమె సూచించారు. గ్రామస్థాయిలో పార్టీ కార్యకలాపాలను చురుకుగా నిర్వహించి ప్రజలతో మరింత సాన్నిహిత్యం పెంచుకోవాలని పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో లోతుగడ్డ మాజీ సర్పంచ్ చింతర్ల సునీల్ కుమార్, ఎంపీటీసీ పాంగి బాబురావు, క్లస్టర్ ఇంచార్జ్ భీమన్న, గ్రామ కమిటీ అధ్యక్షుడు పాంగి బాబురావు, గ్రామ బీసీ అధ్యక్షుడు బి. దుర్గాప్రసాద్, గ్రామ తెలుగు యువత అధ్యక్షుడు కోర్ర నర్సింగరావు తదితరులు పాల్గొన్నారు.ం

## నవధాన్యాలు సాగుతో రైతులకి బహుళ ప్రయోజనాలు : డి.పి.యం పూజారి సత్యన్నారాయణ



**టెక్కలి, పెన్ పవర్ ఏప్రిల్ 10 :** కోటబొమ్మాలి మండలం హరిశ్చంద్రపురం గ్రామంలో జిల్లా ప్రకృతి వ్యవసాయ ప్రాజెక్ట్ మేనేజర్ పూజారి సత్యన్నారాయణ ఆధ్వర్యం లో శు క్రవారం సిబ్బంది నవధాన్య విత్తన కిట్స్ ను తయారు చేశారు. ఈ సందర్భంగా డిపిఎం పూజారి సత్యన్నారాయణ మాట్లాడుతూ నోడల్ బి.ఆర్.సి సెంటర్ లో రెండు వేల విత్తన కిట్స్ ను తయారుచేశామని అన్నారు. రైతుల తో నవధాన్య విత్తన సాగుకు అవసరమైన విత్తనాలను సిబ్బంది గ్రామాల్లో క్షేత్ర స్థాయిలో సరైన ప్రణాళికలు చేసుకొని విత్తన కిట్స్ ను రైతులందరకి పంపిణీ చేయాలని ఆదేశించారు.

ఈ కార్యక్రమం లో అడిసినల్ డిపియం ధనుంజయరావు, ప్రకృతి వ్యవసాయ సిబ్బంది పాల్గొన్నారు.

## బధిర క్రికెట్ క్రీడాకారిణి గొగ్గి రోహిణికి ఘన సన్మానం



**టెక్కలి, పెన్ పవర్ ఏప్రిల్ 10** : టెక్కలి మండలం పెద్దసాన గ్రామానికి చెందిన బధిర క్రికెట్ క్రీడాకారిణి గొగ్గి రోహిణికి టెక్కలి బీజేపీ మండల అధ్యక్షుడు, కోటబొమ్మాళి మార్కెట్ కమిటీ డైరెక్టర్ జర్జాన రాంజీ ఆధ్వర్యంలో శుక్రవారం బిజెపి నాయకులు ఘనంగా సన్మానం నిర్వహించారు. ఈ సందర్భంగా బిజెపి నాయకులు మాట్లాడుతూ రోహిణి భవిష్యత్తులో మరింత ఉన్నత స్థాయికి ఎదిగి దేశానికి కీర్తి తీసుకురావాలని ఆకాంక్షించారు. హర్యానా లో గత నెల 23 నుండి 27 వరకు జరిగిన జాతీయ స్థాయి డెఫ్ టీ 10 క్రికెట్ ఛాంపియన్ షిప్‌లో విజేతగా నిలిచిన రాష్ట్ర జట్టుకు ఆమె ప్రాతినిధ్యం వహించారు. ఈ సందర్భంగా టెక్కలి బిజెపి నాయకులు, గ్రామస్థులు ఆమె ప్రతిభను కొనియాడుతూ, శాలువా కప్పి ఘనంగా సత్కరించారు.

ఈ కార్యక్రమంలో బిజెపి జిల్లా ఉపాధ్యక్షులు నడుపూర్ లక్ష్మీనారాయణ, మాజీ సర్పంచ్ కోట శివరామరాజు, యువ మోర్చా సెక్రటరీ దూపాన రాజకుమార్, మండల వైస్ ప్రెసిడెంట్ ఆకుల ప్రకాష్, కూన రమణ, బాపూజీ జీవరత్నం, ఎర్రన్న, వేణు తదితరులు పాల్గొన్నారు.

## ప్రజాదర్బార్ నిర్వహించిన ప్రభుత్వ విప్.



**గుమ్మలక్ష్మీపురం ఏప్రిల్ 10పెన్ పవర్.**మండలంలో కురుపాం నియోజకవర్గ ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో శు క్రవారం నాడు ప్రభుత్వ విప్ మరియు కురుపాం శాసనసభ్యులు తోయక జగదీశ్వరి ప్రజాదర్బార్ నిర్వహించారు.ఈ ప్రజాదర్బార్‌కు నియోజకవర్గానికి చెందిన వివిధ గ్రామాల నుంచి హాజరైన ప్రజలు తమ గ్రామాలకు సంబంధించిన సమస్యలను ఎమ్మెల్యేకు వినతి రూపంలో అందజేసి వివరించారు.పలు అంశాలపై ప్రజలు తమ ఆవేదనను తెలియజేశారు.ఎమ్మెల్యే ప్రతి సమస్యను శ్రద్ధగా విని,సంబంధిత అధికారులతో సమన్వయం చేసి త్వరితగతిన పరిష్కరించేలా చర్యలు తీసుకుంటామని అన్నారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రజల సమస్యలను నేరుగా తెలుసుకునేందుకు ప్రజాదర్బార్ ఎంతగానో ఉపయోగపడుతుందని అన్నారు.ప్రభుత్వ పథకాలు అర్హులైన ప్రతి ఒక్కరికీ అందేలా కృషి చేస్తున్నామని తెలిపారు.కార్యక్రమంలో కూటమి నాయకులు,కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## స్వచ్ఛ్ ఆంధ్ర లక్ష్యాలకు బాటలు వేసిన సానిటేషన్ వర్కర్స్ శిక్షణ కార్యక్రమం





**విశాఖ ఏప్రిల్ 10:(పెన్ పవర్)**విశాఖ దక్షిణ నియోజకవర్గం 34, 35వ వార్డుల్లో ఈరోజు సానిటేషన్ వర్కర్లకు కెపాసిటీ బిల్డింగ్ ట్రైనింగ్ కార్యక్రమం నిర్వహించబడింది. స్వర్ణాంధ్ర స్వచ్ఛ్ ఆంధ్ర కార్యక్రమంలో భాగంగా జీవీఎంసీ అధికారుల ఆహ్వానం మేరకు ఈ శిక్షణ కార్యక్రమం జరిగింది.

ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా రాష్ట్ర స్వచ్ఛ ఆంధ్ర కార్పొరేషన్ డైరెక్టర్ బుచ్చ రాము రెడ్డి, స్వచ్ఛ్ ఆంధ్ర కార్పొరేషన్ డైరెక్టర్ ఎం నాగలక్ష్మి పాల్గొన్నారు. ఈ సందర్భంగా సానిటేషన్ వర్కర్లు తీసుకోవలసిన జాగ్రత్తలు, వారి పని విధానాలు, పరిశుభ్రత ప్రమాణాలపై అవగాహన కల్పించారు.

కార్యక్రమంలో 34వ వార్డు మరియు 35వ వార్డుల సానిటరీ సిబ్బంది, నెల్లి కనకరాజు, గుజ్జి గణేష్, ఎస్ కుమార్ తో పాటు రెండు వార్డుల కూటమి నాయకులు పాల్గొన్నారు. స్వచ్ఛత పరిరక్షణలో సానిటేషన్ వర్కర్ల పాత్ర అత్యంత కీలకమని కార్యక్రమంలో స్పష్టం చేశారు.

## తిలక్.. నీకు బట్టలూడదీసి గుండు కొట్టిస్తాం ఖబర్దార్




తిలక్ పై నిప్పులు చెలరేగిన పినకాన అజయ్ కుమార్

**టెక్కలి, పెన్ పవర్ ఏప్రిల్ 10** : మంత్రి అచ్చన్న నాయుడు ఇకపై ప్రేలాపన చేస్తే తిలక్.. నీకు బట్టలూడదీసి గుండు కొట్టించి ఊరేగిస్తామని టెక్కలి నియోజకవర్గ వైఎస్ఆర్సిపి ఇంచార్జ్ పేరాడ తిలక్ కి బహిరంగంగా టిడిపి జిల్లా లీగల్ సెల్ ఉపాధ్యక్షులు పినకాన అజయ్ కుమార్ హెచ్చరించారు. టెక్కలి టిడిపి కార్యాలయంలో శుక్రవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన తిలక్ పై నిప్పులు చెరిగారు. అన్న ఎర్రం నాయుడికి అచ్చన్న నాయుడు చంపించాడని తిలక్ మతిస్థిమితం లేక మాట్లాడుతున్నాడని అన్నారు. నువ్వెంత నీ బ్రతుకెంత, నాటు సారా అమ్ముకుని బతికిన నీవు మా నాయకుడిని విమర్శించే స్థాయి నీకుందా అంటూ మండిపడ్డారు. అవినీతి సొమ్ముతో వైజాగ్ లో నాలుగు ఇల్లు కట్టుకున్న నువ్వు మా నాయకుడిని విమర్శిస్తావా.. కొన్ని దశాబ్దాలుగా ఎమ్మెల్యేలుగా ప్రజల మనసులు దోచుకుని ప్రజా సేవ చేస్తున్న కింజరాపు కుటుంబం ఎక్కడ కనీసం వార్డు మెంబర్ కు అర్హతలేని నువ్వెక్కడ అంటూ విమర్శించారు. అన్నగా తమ్ముడు అచ్చన్న నాయుడుని ఎమ్మెల్యే ని చేసుకున్న ఘనత ఎర్రన్నాయుడుది అని అన్నారు. నీ ప్రవర్తన చూస్తుంటే మానసిక రోగిని తలపిస్తుందన్నారు. మా కార్యకర్తలకు కనుసైగ చేస్తే నీ ఊరులోనే నిన్ను వెంటబెట్టి కొడతారు అంటూ హెచ్చరించారు. మౌనంగా ఉన్నామని అతిగా ప్రవర్తిస్తే తగిన శాస్తి తప్పదన్నారు. ఈ సమావేశంలో టెక్కలి మండల టిడిపి అధ్యక్షులు బగాది శేషగిరిరావు, హనుమంతు రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

## తిరుపతి--శ్రీకాకుళం మధ్య హమ్సఫర్ ఎక్స్‌ప్రెస్ ప్రారంభం:

**విశాఖ మీదుగా నడపాలని సభ్యుడు చలసానిగాంధీ విజ్ఞప్తి**



**విశాఖపట్నం, ఏప్రిల్ 10: (పెన్ పవర్)**విశాఖపట్నం డివిజనల్ రైల్వే యూజర్స్ కన్సల్టేటివ్ కమిటీ సభ్యుడు చలసాని గాంధీ, తిరుపతి--శ్రీకాకుళం రోడ్ మధ్య కొత్తగా ప్రవేశపెడుతున్న హమ్సఫర్ ఎక్స్‌ప్రెస్ (17439/17440) రైలు సేవలను స్వాగతించారు. ఈ రైలు సేవలు ఏప్రిల్ 13 నుంచి ప్రారంభమై, ప్రతి ఆదివారం తిరుపతి నుంచి, ప్రతి సోమవారం శ్రీకాకుళం రోడ్ నుంచి నడవనున్నట్లు రైల్వే శాఖ ప్రకటించింది.


ఆధునిక కోచ్‌లతో ఈ రైలు ప్రయాణికులకు మరింత సౌకర్యవంతమైన ప్రయాణాన్ని అందించనుందని గాంధీ తెలిపారు. ఈ సేవ ప్రారంభంతో తిరుపతి మరియు ఉత్తరాంధ్ర ప్రాంతాల మధ్య రవాణా సౌలభ్యం మెరుగుపడుతుందని ఆయన అభిప్రాయపడ్డారు.

ఈ సందర్భంగా రైల్వే శాఖకు కృతజ్ఞతలు తెలియజేసిన ఆయన, ఉత్తరాంధ్ర ప్రజల తరపున ప్రత్యేక అభినందనలు తెలిపారు. భక్తులు, విద్యార్థులు, ఉద్యోగులు సహా అన్ని వర్గాల ప్రజలకు ఈ రైలు ఎంతో ఉపయోగకరంగా నిలుస్తుందని చెప్పారు.

అయితే ప్రస్తుతం ఈ రైలు దువ్వాడ మీదుగా నడవనుండటంపై స్పందించిన గాంధీ, విశాఖపట్నం మీదుగా మళ్లిస్తే మరింత మంది ప్రయాణికులకు ఉపయోగపడుతుందని సూచించారు. విశాఖపట్నం--తిరుపతి మధ్య ఇప్పటికే నడుస్తున్న తిరుమల ఎక్స్‌ప్రెస్‌లో భారీ రద్దీ ఉన్న నేపథ్యంలో, రెండో రైలు కోసం చాలా కాలంగా డిమాండ్ ఉన్నదని ఆయన గుర్తుచేశారు.

కాబట్టి, హమ్సఫర్ ఎక్స్‌ప్రెస్‌ను విశాఖపట్నం మీదుగా నడిపించేలా చర్యలు తీసుకుంటే ప్రయాణికుల రద్దీ తగ్గి, మరింత మెరుగైన సేవ అందించవచ్చని గాంధీ తన ప్రకటనలో విజ్ఞప్తి చేశారు.

## శ్రీకాకుళం జిల్లా బిజెపి అధికార ప్రతినిధిగా బైపల్లి పరమేశ్వరరావు



**టెక్కలి, పెన్ పవర్ ఏప్రిల్ 10 :**టెక్కలి నియోజకవర్గం సంతబొమ్మాళి మండలం మేఘవరం పంచాయతీ సూరాడవానిపేట గ్రామానికి చెందిన బైపల్లి పరమేశ్వరరావు శ్రీకాకుళం జిల్లా బీజేపీ అధికార ప్రతినిధిగా నియమించారు. రాష్ట్ర బీజేపీ అధ్యక్షులు పి వి ఎన్ మాధవ్ ఆదేశాలతో శ్రీకాకుళం జిల్లా అధ్యక్షులు సిరిపురం తేజేశ్వరరావు శుక్రవారం ప్రకటించారు. ఈ సందర్భంగా బైపల్లి పరమేశ్వరరావు మాట్లాడుతూ తనకి ఈ అవకాశాన్ని ఇచ్చిన బి జె పి అధ్యక్షులు పి వి ఎన్ మాధవ్ , సిరిపురం తేజేశ్వరరావు లకు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. సామాన్యుడి గొంతుక గా ఉంటానని ఆయన మాటిచ్చారు. కాగా నిజాయతీ, వ్యక్తిత్వం, సామాజిక స్పృహ సేవాభావం కలిగిన బైపల్లి పరమేశ్వరరావు కి పదవి రావడం పట్ల పార్టీలకి అతీతంగా పలువురు అభినందలు తెలిపారు.

## ప్రజలంతా ఆరోగ్యకరమైన సమాజం కోసం పాటుపడాలి




**టెక్కలి, పెన్ పవర్ ఏప్రిల్ 10** : టెక్కలి మండలం ధర్మనీలాపురం గ్రామంలో ప్రపంచ టీబీ వ్యతిరేక దినం సందర్భంగా వందరోజుల ప్రచార కార్యక్రమం లో భాగంగా శు క్రవారం టి బి పై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా టీబీ సూపర్‌వైజర్ పి. వరప్రసాదరావు మాట్లాడుతూ ప్రతి ఒక్కరికి ఆరోగ్యం పై శ్రద్ధ ఉండాలని తద్వారా ప్రజలంతా ఆరోగ్యకరమైన సమాజం కోసం పాటుపడాలని కోరారు. ఈ కార్యక్రమంలో టీబీ అవగాహన బృందం సభ్యులు గిరిబాబు. ఝాన్సీ, ఏఎన్ఎమ్ కె.భవానీ, అంగన్వాడీ కార్యకర్త జయలక్ష్మి, గ్రామస్తులు పాల్గొన్నారు.


# జగన్మోహన్ రెడ్డి పై అనుచిత వ్యాఖ్యలు చేసిన మంత్రి అచ్చన్నాయుడు దిష్టిబొమ్మ దగ్ధం





- జగన్మోహన్ రెడ్డి పై అనుచిత వ్యాఖ్యలకు నిరసనగా టెక్కలిలో మానవహారం
- ఎర్రన్నాయుడు మరణానికి కారణం అచ్చన్నాయుడే : పేరాడ తిలక్

**టెక్కలి, పెన్ పవర్ ఏప్రిల్ 10** : వైయస్సార్సీపి జాతీయ అధ్యక్షులు మాజీ ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్ రెడ్డిపై మంత్రి అచ్చన్నాయుడు అనుచిత వ్యాఖ్యలు చేయడంతో పాటు జుగుప్సాకరమైన మాటలు మాట్లాడినందుకు నిరసనగా గురువారం రాత్రి వైయస్సార్ సిపి శ్రేణులు నిరసన తెలిపారు. వైఎస్ఆర్సిపి టెక్కలి నియోజకవర్గ ఇన్చార్జ్ పేరాడ తిలక్ ఆధ్వర్యంలో టెక్కలి వైయస్సార్ జంక్షన్ వద్ద అచ్చన్నాయుడు దిష్టిబొమ్మను వైయస్సార్సీపి శ్రేణులు దగ్ధం చేశారు. అచ్చన్నాయుడు వ్యాఖ్యలకు నిరసనగా పెద్ద ఎత్తున కార్యకర్తలు హాజరై అచ్చన్న నాయుడు డౌన్ డౌన్ అంటూ మానవహారం చేపట్టారు. ఈ సందర్భంగా పేరాడ తిలక్ మాట్లాడుతూ అచ్చన్న నాయుడు సంస్కారహీనంగా మాట్లాడుతూ రాజకీయాలను భ్రష్టు పట్టిస్తున్నారని ఆరోపించారు. తనకు పదవులు రాకుండా అడ్డుకుంటున్నారని తన అన్న ఎర్రన్నాయుడు చస్తే గాని నాకు పదవి రాదని నీవు నీ సహచరుల వద్ద ఎర్రన్నాయుడుపై ఎన్నిసార్లు దుర్భాషలో ఆడేవో అందరికీ తెలుసు అని తిలక్ అన్నారు. ఎర్రం నాయుడు మరణానికి కారణమైన అచ్చన్నాయుడు ..ఎర్రన్నాయుడు చనిపోయిన తర్వాత ప్రమాదానికి కారణమైన చౌదరి బాబ్జికి జిల్లా పరిషత్ చైర్మన్ పదవి ఇచ్చి సత్కరించారని, ఎర్రం నాయుడు మరణానికి పరోక్షంగా కారణమయ్యాడని తిలక్ ఆరోపించారు. ఈ కార్యక్రమంలో నాలుగు మండలాలకు చెందిన వైఎస్ఆర్సిపి నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు




## ఆరోగ్యాన్ని అడిగి, అనుబంధాన్ని గుర్తుచేసిన భేటీ

- బొత్సను కలిసిన తెలుగు శక్తి అధ్యక్షుడు బి.వి.రామ్



**విశాఖ ఏప్రిల్ 10:(పెన్ పవర్)**విశాఖపట్నం: ఆంధ్రప్రదేశ్ శాసనమండలిలో ప్రతిపక్ష నేత, వైసీపీ సీనియర్ నాయకుడు బొత్స సత్యనారాయణను తెలుగు శక్తి అధ్యక్షుడు బి.వి.రామ్ (బి.వి.ఆర్) మర్యాదపూర్వకంగా కలుసుకున్నారు. శుక్రవారం ఉదయం విశాఖపట్నంలోని సిరిపురంలో ఉన్న బొత్స నివాసంలో ఈ భేటీ జరిగింది. ఇటీవల బొత్స సత్యనారాయణ ఆరోగ్యం కొంత మందగించిన నేపథ్యంలో, ఆయన ఆరోగ్య పరిస్థితిని తెలుసుకోవడం కోసం బి.వి.రామ్ ఈ సమావేశానికి వచ్చినట్లు సమాచారం. ఈ సందర్భంగా "ప్రస్తుతం మీ ఆరోగ్యం ఎలా ఉందో తెలుసుకోవాలని, ఎప్పుడూ మంచి ఆరోగ్యంతో ఉండాలని కోరుకుంటున్నాను" అని బి.వి.రామ్ అన్నారు.

ఇద్దరి మధ్య స్నేహపూర్వక వాతావరణంలో చర్చలు సాగాయి. ముఖ్యంగా ఉత్తరాంధ్ర ప్రాంతంలో ప్రత్యేక గుర్తింపు పొందిన బొత్స సత్యనారాయణతో తమ కుటుంబానికి ఉన్న అనుబంధాన్ని బి.వి.రామ్ ప్రస్తావించారు. తన తండ్రి దివంగత బి.వి.రామారావుతో బొత్సకు ఉన్న సన్నిహిత సంబంధాలను ఈ సందర్భంగా గుర్తు చేసుకున్నారు.

ఈ భేటీ రాజకీయ పరంగా కాకుండా, పరస్పర ఆప్యాయతను ప్రతిబింబించేలా సాగడం విశేషం

## దుర్గమాంబ ఆలయ వార్షికోత్సవం లో పల్లా





**గాజువాక :పెన్ పవర్ ,ఏప్రిల్ 10** రాష్ట్ర తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు గాజువాక శాసనసభ్యుడు పల్లా శ్రీనివాసరావు , డొంకాడ పండగ దుర్గమాంబ ఆలయానికి, కొత్తపాలెం ఫార్మాసిటీ దుర్గ మాంబ వార్షికోత్సవం లో పాల్గొని అమ్మవారిని దర్శనం చేసుకొని ప్రత్యేక పూజాదికాలు నిర్వహించారు . అమ్మవారు ఆశీస్సులు ప్రజలందరి పైన ఉండాలని, ఎటువంటి గొడవలు ఏం లేకుండా పండగ సంతోషాలతో గ్రామాల ప్రజలు బంధువులు పండగ జరుపుకోవాలని అన్నారు. ఈ కార్యక్రమంలో గాజువాక సమన్వయకర్త సివిల్ సప్లై డైరెక్టర్ ప్రసాదుల శ్రీనివాసరావు , 85వ వార్డు తెలుగుదేశం పార్టీ అధ్యక్షుడు కర్రి దశేంద్ర,గొల్లవిల్లి నూకరాజు కమాండో, గజ్జల నూకరాజు,ఇల్లపు ఈశ్వరరావు, పెదపాటి శివరామకృష్ణ,బొబ్బరి పెంటారావు, అట్ట అప్పారావు, బొబ్బరి శ్రీనివాసరావు, బొబ్బరి రమేష్, బొబ్బరి వంశీ, సంద్రపాటి జోగారావు, గొల్లవిల్లి సన్యాసిరావు, పితాని నీలకంఠ రావు,పాలవలస ఈశ్వరరావు, గొల్లవిల్లి అప్పలరాజు, కండేపల్లి చిన్నారావు గొల్లవిల్లి సత్తిబాబు, గొల్లవిల్లి సత్యారావు, దాసరి అప్పలరాజు, గొల్లవిల్లి రాజు, కర్రి నాగరాజు, ఎలమంచిలి రమణ, దొప్ప ఆనంద్ తదితరులు పాల్గొన్నారు.

# వసతిగృహాల నిర్వహణ సక్రమంగా ఉండాలి

### జిల్లా కలెక్టర్ ఎస్. రాంసుందర్ రెడ్డి



**విజయనగరం టౌన్, పెన్ పవర్, ఏప్రిల్ 10:** జిల్లాలో గల సాంఘిక సంక్షేమ వసతి గృహాలలో విద్యార్థులకు కావలసిన మౌలిక సదుపాయాలన్నీ సక్రమంగా కల్పించాలని జిల్లా కలెక్టర్ ఎస్.రాంసుందర్ రెడ్డి అధికారులను ఆదేశించారు. శుక్రవారం సాయంత్రం కలెక్టర్ కార్యాలయ సమావేశ మందిరంలో వసతి గృహాల నిర్వహణపై సాంఘిక సంక్షేమ శాఖ అధికారులతో జిల్లా కలెక్టర్ సమావేశం నిర్వహించారు.

సమావేశంలో వసతి గృహాల్లో గల సదుపాయాలు, మంజూరైన పనులను జిల్లా కలెక్టర్ సమీక్షించారు. సమావేశంలో జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ వసతి గృహాలలో శానిటేషన్, మరుగుదొడ్లు, నీటి సరఫరా వంటి మౌలిక సదుపాయాల కల్పనకు అధిక ప్రాధాన్యత ఇవ్వాలని ఆదేశించారు. వసతి గృహాల్లో చేపట్టవలసిన అత్యవసర పనుల వివరాలను సోమవారం నాటికి అందజేయాలని వసతి గృహ అధికారులను ఆదేశించారు.

జిల్లా సాంఘిక సంక్షేమ అధికారిని ఎం. అన్నపూర్ణమ్మ జిల్లా వ్యాప్తంగా గల వసతి గృహాలలో చేపట్టిన పనుల వివరాలను జిల్లా కలెక్టర్ కు తెలియజేశారు. 22 వసతి గృహాలలో 439 లక్షల రూపాయలతో మరమత్తు పనులు చేపట్టి, పూర్తి చేసినట్లు తెలిపారు. ఈ సమావేశంలో సహాయ సంక్షేమ అధికారులు, సాంఘిక సంక్షేమ గృహ అధికారులు పాల్గొన్నారు.

# మిషన్ హార్టికల్చర్ విజన్

### ఉద్యాన పంటలకు మారే రైతులకు ప్రోత్సాహం : జిల్లా కలెక్టర్ ఎస్. రాంసుందర్ రెడ్డి



**విజయనగరం టౌన్, పెన్ పవర్, ఏప్రిల్ 10 :** జిల్లాలో ఉద్యాన సాగును విస్తరించేందుకు ప్రత్యేకంగా రూపొందించి, ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న మిషన్ హార్టి విజన్ కార్యక్రమంలో భాగంగా ఉద్యాన పంటలకు మారే రైతులకు కావలసిన సహాయ సహకారాలను అందించాలని జిల్లా కలెక్టర్ ఎస్. రామసుందర్ రెడ్డి అధికారులను ఆదేశించారు. మిషన్ హార్టికల్చర్ విజన్ కార్యక్రమంపై కలెక్టర్ కార్యాలయం నుండి ఉద్యానవన శాఖ మరియు వ్యవసాయ శాఖ అధికారులతో జిల్లా కలెక్టర్ వీడియో కాన్ఫరెన్స్ ద్వారా శుక్రవారం మధ్యాహ్నం సమీక్ష నిర్వహించారు.

మండలం వారీగా నిర్దేశించిన లక్ష్యాలపై సమీక్ష నిర్వహిస్తూ ఖరీఫ్ (2026-27) లో లక్ష్యం గా నిర్ణయించిన 7260 ఎకరాలలో ఉద్యాన సాగు చేపట్టేలా చర్యలు తీసుకోవాలన్నారు. బ్లాకుల వారీగా భూమిని సిద్ధం చేయాలని, ప్రతి బ్లాక్ లో కనీసం ఐదు ఎకరాలకు తక్కువ లేకుండా భూమి ఉండాలని తెలిపారు. నీరు, కరెంటు అందుబాటులో లేని 5088 ఎకరాలకు బోరుబావి, కరెంటు సదుపాయం కల్పించుటకు చర్యలు తీసుకోవాలని తెలిపారు. అవసరమైన రైతులకు రుణసదుపాయం కల్పించాలని సూచించారు. నీరు సదుపాయం ఉండి కరెంటు లేని భూములు వివరాలు ప్రత్యేకంగా తెలియజేయాలన్నారు. కరెంటు సదుపాయం కల్పించవలసిన 950 ఎకరాలకు వెంటనే విద్యుత్ కనెక్షన్లు మంజూరు చేయాలన్నారు. తక్కువ ఖర్చుతో కరెంట్ సదుపాయం కల్పించుటకు 180 మీటర్ల దూరంలో బ్లాకులు ఉండేటట్లు చూడాలన్నారు. తద్వారా అదనపు ఖర్చు లేకుండా రైతులకు కరెంటు సదుపాయం కల్పించవచ్చని తెలిపారు.

ఈ సమావేశంలో జిల్లా ఉద్యాన శాఖ అధికారి చిట్టిబాబు, వ్యవసాయ శాఖ అధికారి వి టి రామారావు, డిఆర్డిఏ ప్రాజెక్టు డైరెక్టర్ శ్రీనివాస పాణి, వ్యవసాయ, ఉద్యాన శాఖ సిబ్బంది పాల్గొన్నారు.

## వాడబలిజల దుర్గాలమ్మ జాతరకు వాసుపల్లి విరాళం మహోత్సవానికి ఏర్పాట్లు



**విశాఖ దక్షిణం, పెన్ పవర్, ఏప్రిల్ 10** :విశాఖపట్నం దక్షిణ నియోజకవర్గం కొబ్బరి తోట వీధిలో వాడబలిజి మత్స్యకార సమాజాని కి ఆరాధ్యదైవమైన శ్రీ దుర్గాలమ్మ జాతర మహో త్సవానికి మాజీ ఎమ్మెల్యే, నియోజకవర్గ సమ న్వయకర్త వాసుపల్లి గణేష్ కుమార్ రూ.50,00 0 విరాళాన్ని అందజేశారు. శుక్రవారం ఆశీలమె ట్టలోని తన కార్యాలయంలో జాతర కమిటీ సభ్యులకు చెక్కును అందించారు.

ప్రతి సంవత్సరం మాదిరిగానే ఈసారి కూడా జాతర విజయవంతంగా నిర్వహించేందుకు సహకరిస్తున్నందుకు కమిటీ సభ్యులు వాసుప ల్లికి కృతజ్ఞతలు తెలిపారు. అమ్మవారి కృపతో ఆయన ఆయురారోగ్యాలతో మరింత ప్రజాసేవ చేయాలని, తిరిగి ప్రజా నాయకుడిగా ఎదగాల ని ఆకాంక్షిస్తున్నట్లు పేర్కొన్నారు. ఏప్రిల్ 14, 15, 16 తేదీల్లో 34వ వార్డులో జరగనున్న దుర్గాల మ్మ జాతరకు వాసుపల్లి గణేష్ కుమార్‌ను కమి టీ సభ్యులు ఆహ్వాన పత్రిక అందజేసి సాదరం గా ఆహ్వానించారు. ఈ సందర్భంగా వాసుపల్లి గణేష్ కుమార్ మాట్లాడుతూ, వాడబలిజి సమాజానికి గ్రామదేవతగా విరాజిల్లుతున్న దుర్గాలమ్మ జాతర ప్రతి సంవత్సరం భక్తిశ్రద్ధల తో నిర్వహించబడుతుందని చెప్పారు. ఈ ఏడాది కూడా ఉత్సవాలు విజయవంతంగా జరగాలని, అమ్మవారి ఆశీస్సులు నియోజకవర్గ ప్రజలందరిపై ఉండాలని ఆకాంక్షించారు. అలాగే తమ అధినేత వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి మళ్లీ ముఖ్యమంత్రిగా ప్రజలకు సేవ చేసే అవకాశం కలగాలని అమ్మవారిని ప్రార్థిస్తున్నట్లు తెలిపా రు. ఈ కార్యక్రమంలో కమిటీ సభ్యులు దాసరి ఎల్లయ్య, వాసుపల్లి ఎల్లారావు, వాసుపల్లి దానయ్య, గరికిన కొండబాబు, కెవిఎన్ రాజు, సూరడా రాంబాబు, రాష్ట్ర నాయకులు లింగం శ్రీను, లండ రమణ, జిల్లా నాయకులు వాసుప ల్లి ధనరాజు, కడవల నాగమణి, వార్డ్ నాయకు లు గాలి పార్వతి, సిహెచ్. జ్యోతి, సూరడా లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.

## తిలారులో లేగ దూడల ప్రదర్శన కార్యక్రమం



**టెక్కలి, పెన్ పవర్ ఏప్రిల్ 10** : కోటబొమ్మాళి మండలం తిలారు గ్రామం లోని పశువైద్య చికిత్సాలయంలో శుక్రవారం లేగ దూడల ప్రదర్శన నిర్వహించారు. జిల్లా పశు గణాభివృద్ధి సంస్థ (డి.ఎల్.డి.ఎ.) సౌజన్యముతో ఉపసంచాలకులు డాక్టర్ సి.ఎచ్. సత్య ప్రకాష్ ఈ కార్యక్రమం ఏర్పాటు చేసారు. మండల పరిధిలోని తిలారు , తుంబయ్యపేట, రావిపాడు ,ఏనేటి కొత్తూరు గ్రామాల నుండి సుమారు 40 దూడలు తీసుకొచ్చి ప్రదర్శించారు. దూడలలో.. తక్కువ వయసులో ఏపుగా పెరిగిన దూడలను, జాతిని బట్టి నిర్ధారించుకొని బహుమతులకు ఎంపిక చేశారు. 1 నుండి 6 మసాల వయసు వరకు ఒక గ్రూపుగా, 7 నుండి 12 మసాల వయసు వరకు ఇంకో గ్రూపుగా ఏర్పాటు చేసి.. రెండు గ్రూపులలో కూడా మూడేసి బహుమతులు ఇచ్చారు. మొదటి గ్రూపులో మొదటి బహుమతి పల్లి భీమారావు, రెండవ బహుమతి వెలమల సూర్యనారాయణ, మూడవ బహుమతి శిమ్మ సింహాచలం దూడలు కైవసం చేసుకున్నాయి. రెండవ గ్రూపులో మొదటి బహుమతి చల్ల ఎర్రయ్య, రెండవ బహుమతి తర్ర అయ్యన్నాయుడు, మూడవ బహుమతి మెండ నరసింగరావు ల దూడలకు దక్కింది. అలాగే మిగిలినదోడలకు కూడా ప్రోత్సాహక బహుమతులతో పాటు ఉచిత నటుల నివారణ మందులు, ప్రో బయాటిక్ పౌడర్స్ అందించారు. ఈ సందర్భంగా పశువైద్యాధికారి డాక్టర్ లెఖినేని కిరణ్ కుమార్ మాట్లాడుతూ

పాడి పరిశ్రమలో లాభాల కోసం శాస్త్రీయ పద్ధతుల్లో దూడల పెంపకం, పోషణ ,ఆరోగ్యం పై ప్రత్యేక శ్రద్ధ వహించడం చాలా ముఖ్యమని తెలిపారు.

ఈ కార్యక్రమములో జిల్లా పశుగణాభివృద్ధి సంస్థ ఉప సంచాలకులు డా. సి.ఎచ్.సత్య ప్రకాష్ , కోటబొమ్మాళి సహాయ సంచాలకులు డా.ఎమ్.లోకనాథము , డా.ఎమ్.ప్రజ్ఞ చైతన్య , మండల పశువైద్య సహాయక సిబ్బంది రాంబాబు, ఫణీంద్ర, ప్రసాదరావు, భాస్కరరావు, రామకృష్ణ పాల్గొన్నారు.

## దాదుపురంలో మినీ క్రికెట్ లిగ్.




**గుమ్మలక్ష్మీపురం ఏప్రిల్ 10 పెన్ పవర్.** మండలంలో గల దుడ్డుఖల్లు పంచాయితీ.దాదుపురం గ్రామంలో.గ్రామ యువత మినీ డి.పి.ఎల్ క్రికెట్ లీగ్ ను దాదుపురం గ్రామ పెద్దల ఆధ్వర్యంలో ఘనంగా ప్రారంభించారు.ఈ సందర్భంగా క్రికెట్ టోర్నమెంట్ ఆర్గనైజింగ్ యువత పత్రిక విలేకరులతో మాట్లాడుతూ.ఈ టోర్నమెంట్ కు 64 టీములు పాల్గొంటున్నాయని ఇప్పటికీ విజయవంతంగా ఎనిమిది టీములు ఆడగా నాలుగు టీమ్ లు విజయం సాధించాయని అన్నారు.మినీ క్రికెట్ టోర్నమెంట్ యొక్క ముఖ్య ఉద్దేశం ఏజెన్సీ గిరిజన యువత నైపుణ్యాన్ని వెలికి తీసేందుకు అలాగే యువత చెడు వ్యసనాలకు బానిస కాకుండా క్రీడలపై ఉత్సాహం కలిగించే విధంగా అవగాహన కల్పించాలనే ఉద్దేశంతో మినీ క్రికెట్ టోర్నమెంట్ ను నిర్వహించడం జరుగుతుందని.వారు తెలిపారు. ఇందులో గెలుపొందిన వారికి మొదటి బహుమతిగా 25000 రెండవ బహుమతిగా 12000 ప్రైజ్ మనీ ఇవ్వడం జరుగుతుందని ఆర్గనైజింగ్ యువత తెలిపారు.ఈ కార్యక్రమంలో గ్రామ పెద్దలు యువతి యువకులు పాల్గొన్నారు.

# ఆటోలకు పార్కింగ్ స్థలం కేటాయించండి.

- ట్రాఫిక్ నియంత్రించాలని అధికారులకు ఆటో యూనియన్ విజ్ఞప్తి.





**హుకుంపేట పెన్ పవర్ ఏప్రిల్ 10:**అల్లూరి సీతారామరాజు జిల్లా హుకుంపేట మండల ఆటో యూనియన్ నాయకులు తమకు కనీస సదుపాయాలను కల్పించాలని కోరుతూ మండల తహసీల్దార్ వారికి, మరియు సర్కిల్ ఇన్స్పెక్టర్ సన్యాసినాయుడుకు మరియు పంచాయితీ సచివాలయం అధికారులకు వినతి పత్రం అందించాం అని హుకుంపేట ఆటో యూనియన్ పూర్వపు నాయకులు టి క్రిష్ణరావు ప్రస్తుత అధ్యక్ష కార్యదర్శులు కె సూరి,డి మధు, కె గోవింద్ లు తెలిపారు

ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మండలంలో దాదాపు 150-200మందివరకు ఆదివాసి నిరుద్యోగులు ఆటోలు ద్వార స్వయం ఉపాధి పొందుతున్నాం అన్నారు మాలాంటి వారికి ప్రభుత్వం ప్రోత్సహిస్తూ సబ్సిడీ పై రుణాలు ఇవ్వాల్సి ఉన్నా .ఆ దిశగా స్థానిక ఐటిడిఎ గాని, ప్రభుత్వం గానీ దృష్టి సారించలేదు అన్నారు. మండిపడ్డారు కనీసం

ట్రైకర్ రుణాలు అయినా అందించలేదు అని వాపోయారు

ప్రైవేటు వడ్డీ వ్యాపారులు వద్దనుండి అధిక వడ్డీలతో అప్పులుచేసి సొంతంగా ఆటోలు కొనుక్కొని వాటిద్వారా జీవనోపాధి పొందుతున్నామని వారు తెలియజేశారు.

హుకుంపేట మండలకేంద్రంలో కనీసం ఆటోలు పార్కింగ్ కోసం స్థలం లేదన్నారు, స్థిరమైన సీరియల్ పాయింట్ కూడా లేక ప్రయాణికులు మరియు ఆటో కార్మికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటునాము అని అన్నారు. ఈ సమస్య పై

రెవెన్యూ అధికారులు తక్షణమే స్పందించి ఆటోలు పార్కింగ్ కోసం అలాగే సీరియల్ పాయింట్ కోసం స్థలం కేటాయించాలనీ వారు డిమాండ్ చేశారు.

మండల కేంద్రంలోనీ వర్తకులు వారి వారి షాపుల్లోని సరుకులు ప్రధాన రోడ్డుపైకి ఇరువైపుల దుఃఖాణాలు పేర్చుకొని వ్యాపారాలు చేయడంతో ట్రాఫిక్ జామ్ ఏర్పడుతుందన్నారు.ఈ క్రమంలో ఆటో డ్రైవర్ కస్టమర్లను దించడమో,లేక ఎక్కించడమో చేస్తే పోలీసులు ప్రత్యక్షమై వారినే వాహనాలు పక్కకు తీసేయాలంటూ హెచ్చరిస్తున్నారు. తప్పా రోడ్డుపై దుకాణాలవారికి కనీసం హెచ్చరిక. అయినా చేయరు అని యూనియన్ నాయకులు. అన్నారు.

తక్షణమే రోడ్డుకీరువైపుల ఉన్న దుకాణాలు తొలగించాలన్నారు.

ఈ కార్యక్రమానికి ఆటో యూనియన్ నాయకులు డ్రైవర్లు పాల్గొన్నారు

# మహాత్ముల విగ్రహాల ఆవిష్కరణ కార్యక్రమం జయప్రదం చేయండి




**కూర్మన్న పాలెం :పెన్ పవర్ ,ఏప్రిల్ 10** మహాత్మా జ్యోతిరావు పూలే,బాబాసాహెబ్ బిఆర్ అంబేద్కర్ల జయంతి సందర్భంగా కూర్మన్నపాలెం కూడలిలో ముగ్గురు మార్గదర్శకుల విగ్రహాలు ఆవిష్కరించినట్లు పూలే - అంబేద్కర్ విజ్ఞాన్ ఫౌండేషన్ ట్రస్ట్ చైర్మన్ కేబీఆర్ అంబేద్కర్ తెలిపారు. కార్యక్రమానికి సంబంధించిన గోడ పత్రికను ఆవిష్కరించారు. ఏప్రిల్ 11న సావిత్రిబాయి పూలే, రామా బాయ్ అంబేద్కర్, ఫాతిమా షేక్ ల విగ్రహాలను ఏర్పాటు చేసి ఆవిష్కరిస్తున్నట్లు , కార్యక్రమానికి విశాఖపట్నం జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి, ఆంధ్రప్రదేశ్ సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి డోలా బాల వీరాంజనేయస్వామి, , రాష్ట్ర తెలుగుదేశం పార్టీ అధ్యక్షుడు , గాజువాక శాసనసభ్యుడు పల్లా శ్రీనివాసరావు తదితరులు ముఖ్య అతిథులుగా పాల్గొంటున్నారని తెలిపారు. ప్రతి ఒక్కరి కార్యక్రమాన్ని వచ్చి జయప్రదం చేయవలసిందిగా అంబేద్కర్ కోరారు. కార్యక్రమంలో ట్రస్ట్ ప్రతినిధులు గుంజా చింతయ్య, జవహర్ నాథ్, కాకర్ల మాడి బోస్, పోతల కృష్ణ,శ్రీను బాబు తదితరులు పాల్గొన్నారు.

## తైవాన్ లో రోలర్ స్కేటింగ్ పోటీలకు భారత్ తరుపున చైత్రదీపిక



**నర్సీపట్నం, పెన్ పవర్ (ఏప్రెల్ 10) :**రోలర్ స్కేటింగ్ పోటీలలో అంతర్జాతీయ స్థాయిలో విశేషంగా రాణిస్తున్న నర్సీపట్నంకు చెందిన పెదిరెడ్ల చైత్ర దీపిక మరోసారి దేశం తరపున స్కేటింగ్ పోటీలలో పాల్గొంటుంది. ఈనెల 11 నుండి 20వ తేదీ వరకు తైవాన్ లో జరిగే ఆర్టిస్టిక్ రోలర్ స్కేటింగ్ ఓపెన్ పోటీలకు చైత్రదీపిక భారత్ తరపున పాల్గొంటుంది. ఇటీవల ఆస్ట్రేలియాలో జరిగిన 2025 వరల్డ్ స్కేట్ పసిఫిక్ కప్ లో భారత్ తరపున పాల్గొని పలు విభాగాలలో మూడు బంగారు పతకాలు సాధించింది. గతంలో బీజింగ్లో జరిగిన ఏషియన్ ఛాంపియన్షిప్ లో ఒక పసిడి పతకం, తైవాన్ ఆర్టిస్ట్ రోలర్ స్కేటింగ్ పోటీలలో మూడు పతకాలు సాధించింది. వరుసగా నాలుగో సారి భారత్ తరపున పాల్గొనే అవకాశం రావడంతో సొంత గ్రామం నర్సీపట్నంలోనూ, ప్రస్తుతం ఉంటున్న విజయవాడలోనూ అభినందనలు వెలువెత్తుతున్నాయి. శనివారం నుంచి ప్రారంభం కానున్న ఈ పోటీలలో కూడా చైత్రదీపిక మంచి ప్రదర్శన ఇచ్చి, మరిన్ని పతకాలు సాధించాలని, దేశానికి, రాష్ట్రానికి, సొంత గ్రామానికి మంచి పేరు తీసుకురావాలని స్థానికులు కోరుతున్నారు.

# ఐటి హబ్ గా మారబోతున్న విశాఖ నగరం చిత్రపటం

- సిటీ ఆఫ్ డెస్టినీ నుంచి గ్లోబల్ ఎఐ సిటీగా
- విశాఖ గూగుల్ మెగా ప్రాజెక్టుతో చారిత్రాత్మక
- మైలురాయి- చంద్రబాబు విజన్--లోకేష్ కృషి ఫలితం.
- ఆంధ్రరాష్ట్ర అభివృద్ధికి నూతన యుగానికి నాంది



**గాజువాక : పెన్ పవర్ , ఏప్రిల్10 :**ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం ఐటీ రంగంలో చారిత్రాత్మక ముందడుగు వేయబోతోందని టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు , గాజువాక ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు తెలిపారు. ఏప్రిల్ 28న విశాఖపట్నంలో ప్రపంచ టెక్ దిగ్గజం గూగుల్ సంస్థ డేటా సెంటర్ నిర్మాణానికి ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు శంకుస్థాపన చేయనున్నారని తెలిపారు.సుమారు 15 బిలియన్ డాలర్లు రూ.1.35 లక్షల కోట్లు భారీ పెట్టుబడితో 601 ఎకరాల విస్తీర్ణంలో ఈ మెగా ప్రాజెక్టు రూపుదిద్దుకోనుందని, 2028 జూలై నాటికి పూర్తి స్థాయిలో అందుబాటులోకి రానుందని తెలిపారు. ఈ ప్రాజెక్టు ద్వారా రాష్ట్రానికి అపూర్వమైన పెట్టుబడులు రావడంతో పాటు లక్షల సంఖ్యలో ఉద్యోగ అవకాశాలు సృష్టించబడతాయని పేర్కొన్నారు.ఈ సందర్భంగా పల్లా శ్రీనివాసరావు మాట్లాడుతూ ఇప్పటివరకు సిటీ ఆఫ్ డెస్టినీగా పేరుగాంచిన విశాఖపట్నం ఇకపై గ్లోబల్ స్థాయిలో ఎఐ సిటీగా అవతరించబోతోందని తెలిపారు. దేశంలోనే తొలి 1 గిగావాట్ ఎఐ హబ్‌గా విశాఖ రూపుదిద్దుకోవడం ఆంధ్ర రాష్ట్ర అభివృద్ధికి నూతన దిశను నిర్దేశిస్తుందని పేర్కొన్నారు.ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు దూరదృష్టి, సాంకేతిక అభివృద్ధిపై ఉన్న స్పష్టమైన విజన్ వల్లే గూగుల్ వంటి ప్రపంచ దిగ్గజ సంస్థలు రాష్ట్రానికి ఆకర్షితమవుతున్నాయని పల్లా కొనియాడారు. అలాగే మంత్రి నారా లోకేష్ నిరంతర కృషి, పట్టుదల, వేగవంతమైన కార్యాచరణ వల్లే ఈ భారీ పెట్టుబడి ఆంధ్రప్రదేశ్‌కు సాధ్యమైందని స్పష్టం చేశారు.ఈ ప్రాజెక్టు ద్వారా ఉత్తరాంధ్ర ప్రాంతం మొత్తం టెక్నాలజీ హబ్‌గా మారి, మౌలిక వసతులు, పరిశ్రమలు, ఉపాధి అవకాశాలు విస్తృతంగా పెరుగుతాయని తెలిపారు. యువతకు నైపుణ్యాభివృద్ధి, ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంపై ప్రత్యక్ష అనుభవం లభించి, ప్రపంచ స్థాయి అవకాశాలు అందుబాటులోకి వస్తాయని పేర్కొన్నారు.రాష్ట్ర ప్రభుత్వం పారదర్శక విధానాలు, పెట్టుబడులకు అనుకూల వాతావరణంతో గ్లోబల్ ఇన్వెస్టర్లను ఆకర్షిస్తున్నదని పల్లా తెలిపారు. విశాఖపట్నం కేంద్రంగా ఉత్తరాంధ్ర మొత్తం అభివృద్ధి దిశగా పయనిస్తూ, రహదారులు, విద్యుత్, నీటి సరఫరా వంటి మౌలిక సదుపాయాలు వేగంగా విస్తరిస్తాయని అన్నారు.ఇది కేవలం ఒక డేటా సెంటర్ మాత్రమే కాదని, ఉత్తరాంధ్ర యువత భవిష్యత్తుకు, రాష్ట్ర అభివృద్ధికి మార్గదర్శకమైన మహత్తర అవకాశం అని పల్లా గారు పేర్కొన్నారు. ఈ పెట్టుబడులను అడ్డుకునేందుకు ఎన్నో ప్రతికూల శక్తులు ప్రయత్నించినప్పటికీ, ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు నాయకత్వంలో వాటన్నింటినీ అధిగమించి అభివృద్ధి దిశగా ముందుకు సాగుతున్నామని తెలిపారు.గూగుల్ పెట్టుబడులు రాష్ట్ర అభివృద్ధి పథంలో ఒక కీలక మైలురాయిగా నిలిచి, విజన్ ఆంధ్రప్రదేశ్ మరింత బలం చేకూర్చే చారిత్రాత్మక ఘట్టంగా నిలుస్తాయని పల్లా శ్రీనివాసరావు పేర్కొన్నారు.

## సంకాడ నూతన పంచాయతీ కార్యదర్శిని కలిసిన దేశగిరి గోవిందరావు



**గూడెం కొత్తవీధి,పెన్ పవర్,ఏప్రిల్ 10:**అల్లూరి సీతారామరాజు జిల్లాలోని గూడెం కొత్తవీధి మండలం సంకాడ పంచాయతీ నూతన కార్యదర్శిగా బాధ్యతలు స్వీకరించిన రాజుబాబును టీడీపీ గ్రామ కమిటీ అధ్యక్షుడు దేశగిరి గోవిందరావు మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా కార్యదర్శికి పుష్ప గుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం మండల పరిధిలోని గ్రామాల పరిస్థితులు, స్థానిక సమస్యలు తదితర అంశాలను ఆయనకు వివరించారు.ఈ కార్యక్రమంలో యూనిట్ ఇన్‌చార్జ్ మామిడి చంటిబాబు, పిసా ఉపాధ్యక్షుడు సద్ద బొజ్జిపడల్‌తో పాటు ఇతర నాయకులు పాల్గొన్నారు.

## చిన్నారుల ఆరోగ్యకరమైన ఎదుగుదలకు పోషకాహారం కీలకం





**గూడెంకొత్తవీధి,పెన్ పవర్,ఏప్రిల్ 10:**చిన్నారుల ఆరోగ్యకరమైన ఎదుగుదలకు పోషకాహారం ఎంతో కీలకమని జీకేవీధి వైద్యాధికారులు శివరామ్, రుషశ్రీ తెలిపారు. ఐసిడిఎస్ ఆధ్వర్యంలో తహసిల్దార్ అన్నాజీరావు సమక్షంలో శుక్రవారం జీకేవీధిలో పోషణ పక్వాడ్ అవగాహన కార్యక్రమం నిర్వహించారు.ర్యాలీ నిర్వహించి అవగాహన కల్పించారు. సున్నా నుండి రెండేళ్ల పిల్లలుకు సరైన పోషణ అందిస్తే వారి మేధాశక్తి పెరుగుతుందన్నారు. పిల్లలు భవిష్యత్తుకు అదే సరైన సమయమని అన్నారు. తల్లిదండ్రులు పిల్లలకు ఎక్కువగా ఫోన్ ఇచ్చి వారి మెదళ్లను పాడు చేయవద్దని సూచించారు.పిల్లలు అధికంగా స్క్రీన్ టైమ్ లో ఉండటం వల్ల కంటితో పాటు మెదడు సంబంధ వ్యాధులకు గురవుతారని పేర్కొన్నారు. పిల్లల పట్ల తల్లిదండ్రులు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఐసిడిఎస్ పర్యవేక్షకులు వలసమ్మ, మోహిని, అంగన్వాడీ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# నాతవరం లో పోషణ పక్వాడ కార్యక్రమం ప్రారంభం...






**పిల్లలకు పౌష్టికాహారం అందించడం తల్లిదండ్రులు బాధ్యత....**

**పోషణ్ పక్వాడా అవగాహన పక్షోత్సవాల గోడ పత్రికలను ఆవిష్కరించిన.......**

**ఐసిడిఎస్ పిడి ఎన్.సూర్య లక్ష్మ...**

**నాతవరం,పెన్ పవర్ (ఏప్రిల్ 10):** చిన్నారుల వజ్రాల భవిష్యత్తు కోసం ఆరోగ్యకరమైన అలవాటులను అలవర్చుకోవాలని ఐసిడిఎస్ పిడి ఎన్. సూర్యలక్ష్మి పిలుపునిచ్చారు.శుక్రవారం మండల కేంద్రమైన నాతవరంలో గల మండల పరిషత్ కార్యాలయ సమావేశ మందిరంలో గర్భిణీ స్త్రీలు, వారి కుటుంబ సభ్యుల తో అవగాహన కార్యక్రమం నిర్వహించి "8వ పోషణ్ పక్వాడా అవగాహన పక్షోత్సవాల గోడ పత్రికలను ఆవిష్కరించారు.ఈ సందర్భంగా ఐసిడిఎస్ సూర్యలక్ష్మి మాట్లాడుతూ ఈ నెల 9వ తేదీ నుండి 23వ తేదీ వరకు ఈ వేడుకలు నిర్వహించబడతాయని అన్నారు. ప్రధానంగా "మొదటి ఆరు ఏళ్లలో మెదడు అభివృద్ధిని పెంపొందించడం" అనే ఇతివృత్తంతో ఈ కార్యక్రమం సాగనుందని,ఈ ఏడాది గర్భధారణ సమయం నుండి శిశువు పెంపకం వరకు తండ్రుల పాత్రను పెంచడంపై ప్రత్యేక దృష్టి సారించామని తెలిపారు.రాబోయే రోజులలో జిల్లా వ్యాప్తంగా ఈ 15 రోజుల పాటు వివిధ థీమ్‌ల ఆధారంగా కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు తెలిపారు.మొదటి 1000 రోజులు గర్భిణీ స్త్రీలు మరియు శిశువుల పోషణపై "సుపోషిత జనని, స్వస్థ శిశు " పేరిట అవగాహన సదస్సులు మరియు తండ్రులకు పోషకాహార తయారీ పోటీలు నిర్వహిస్తామని, ప్యాకెట్ ఫుడ్స్ మానేసి, చిరుధాన్యాలు వంటి సంప్రదాయ ఆహారం వైపు మళ్లించేలా ప్రదర్శనలు మరియు "స్వాప్ ది స్నాక్" ఎగ్జిబిషన్లు చేపట్టడం జరుగుతుందని అన్నారు.3 నుండి 6 ఏళ్ల పిల్లల కోసం "ఖేల్-సే-సీఖ్" కార్నివాల్ మరియు తండ్రుల కోసం ప్రత్యేక స్టోరీ టెల్లింగ్ సెషన్లు, పెద్దల కోసం పోషణ మరియు మెదడు అభివృద్ధి అంశాలపై చిత్రలేఖన పోటీలు నిర్వహించబడతాయని తెలిపారు.ఈ కార్యక్రమంలో సీడీపీఓలు శ్రీగౌరి, రమణి, ఎంపీడీఓ ఎంఎస్ శ్రీనివాస్, తహసిల్దార్ ఓ.చందనరేఖ,ఆర్డబ్ల్యూఎస్ జూనియర్ ఇంజనీర్ శ్యామ్,అంగన్వాడీ సూపర్వైజర్లు, ఎంఎల్హెచ్పి మౌనిక,అంగన్వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు

# పంచాయతీల అభివృద్ధికి కృషి చేయాలి...



మండల అభివృద్ధి అధికారి ఎం.సత్య శ్రీనివాస్....


**నాతవరం,పెన్ పవర్ (ఏప్రిల్ 10):** మండలంలోని ఆయా పంచాయతీలకు ప్రత్యేకాధికారులుగా నియమితులైన అధికారులు పంచాయతీల అభివృద్ధికి కృషి చేయాలని నాతవరం ఎంపిడిఒ ఎంఎస్.శ్రీనివాస్ కోరారు.శుక్రవారం మండల అభివృద్ధి అధికారి ఎం.సత్య శ్రీనివాస్ సమీక్షా సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా సర్పంచ్ లు పదవీ కాలం ముగియడంతో ప్రభుత్వం పంచాయతీలకు ప్రత్యేకాధికారులను నియమించడం జరిగిందన్నారు.ఈ మేరకు ఆయా పంచాయతీల్లో నెలకొన్న సమస్యల పరిష్కరించడానికి చొరవ చూపాలని చెప్పారు.మంచినీరు,పారిశుధ్య నిర్వహణపై తగు చర్యలు చేపట్టాలన్నారు. వేసవి నేపథ్యంలో ఆయా పంచాయతీల్లో మంచినీటి సమస్యలు రాకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని చెప్పారు.ఈ కార్యక్రమంలో తహశీల్దార్ ఓ. చందనరేఖ,డిప్యూటీ తహశీల్దార్ టివిఎల్.రాజు,డిప్యూటీ ఎంపిడిఒ కే.మూర్తిబాబు,హౌసింగ్ ఎఇ జోగారావు తదితరులు పాల్గొన్నారు.

## వేరుశెనగ పంటను పరిశీలించిన వ్యవసాయ అధికారి డి. గిరిబాబు




**గూడెం కొత్త వీధి,పెన్ పవర్, ఏప్రిల్ 10:**జీకే వీధి మండలం, దారకొండ పంచాయతీ పరిధిలోని దారాలగొంది గ్రామంలో శుక్రవారం మండల వ్యవసాయ అధికారి, దారకొండ పంచాయతీ ప్రత్యేక అధికారి డి. గిరిబాబు వేరుశెనగ పంటను పరిశీలించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, రబీ సీజన్‌లో 90 శాతం సబ్సిడీపై వేరుశెనగ విత్తనాలను రైతులకు పంపిణీ చేసినట్లు తెలిపారు. నీటి వసతి ఉన్న ప్రాంతాల్లో వేరుశెనగ పంట ఎంతో లాభదాయకమని అన్నారు.రబీ కాలంలో వర్షపాతం తక్కువగా ఉండటంతో శాఖీయ పెరుగుదల తగ్గి, భూమి గుల్లగా మారి, ఊడలు సులభంగా భూమిలోకి చొచ్చుకుపోయి, వేరుశెనగ కాయలు ఎక్కువగా ఏర్పడతాయని వివరించారు. దీంతో వేరుశెనగ దిగుబడి మెరుగ్గా వస్తుందని తెలిపారు.ఈ పరిశీలనలో గ్రామ వ్యవసాయ సహాయకులు జోసెఫ్ మరియు రైతులు పాల్గొన్నారు.

# సమస్యల పరిష్కారం కోసమే ప్రజా దర్బార్ ప్రధాన లక్ష్యం




టిడిపి గ్రీవెన్స్ లో వినతులు స్వీకరించిన పాడేరు మాజీ ఎమ్మెల్యే గిడ్డి ఈశ్వరి

**స్టాఫ్ రిపోర్టర్,పాడేరు/గూడెం కొత్తవీధి,పెన్ పవర్,ఏప్రిల్ 10:** ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను ఎక్కడికక్కడ పరిష్కరించాలనే ప్రధాన లక్ష్యంతోనే కూటమి ప్రభుత్వం, ముఖ్యమంత్రి శనారా చంద్రబాబు నాయుడు ప్రజా దర్బార్ (గ్రీవెన్స్) ను తీసుకొచ్చారని పాడేరు మాజీ ఎమ్మెల్యే గిడ్డి ఈశ్వరి పేర్కొన్నారు. పాడేరులోని తన క్యాంపు కార్యాలయంలో శుక్రవారం గ్రీవెన్స్ నిర్వహించారు. ప్రజలు తెలియజేసిన సమస్యలకు కొన్నింటికి అక్కడికక్కడే పరిష్కారం చూపారు. చాలామంది వ్యక్తిగత సమస్యల పరిష్కారం కోసం గ్రీవెన్స్ ను ఆశ్రయించారు. మరి కొందరు సామాజిక సమస్యలు పరిష్కరించాలని కోరారు. కొత్తగా పెన్షన్లు మంజూరు చేయాలని వివరించారు. గ్రామాల్లో తాగునీటి సమస్య పరిష్కరించాలని, కొత్తగా డ్రైనేజీ నిర్మాణాలు చేపట్టాలని విన్నవించారు. జల్ జీవన్ మిషన్ లో కుళాయిలు నిర్మించినా సరే నీరు రావడంలేదని కొందరు గ్రామస్తులు గ్రీవెన్స్ లో తెలిపారు. అర్జీదారుల నుంచి వినతి పత్రాలు తీసుకున్నానంతరం కొన్నింటికి అధికారులతో మాట్లాడి పరిష్కరించడానికి ప్రయత్నం చేశారు. మరికొన్ని సంబంధిత అధికారులకు సిఫారసు చేశారు. ఈ సందర్భంగా గిడ్డి ఈశ్వరి మాట్లాడుతూ మనది ప్రజా ప్రభుత్వమని ప్రజా సమస్యల పరిష్కారమే లక్ష్యంగా ఈ ప్రజా దర్బార్ ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా ఈ కార్యక్రమం నిర్వహిస్తుందన్నారు. గ్రీవెన్స్ కి వచ్చే ప్రతి వినతి ఆన్ లైన్ లో నమోదు అవుతుందని ప్రభుత్వం ద్వారా సంబంధిత అధికారులకు ఫార్వర్డ్ చేయబడుతుందని దానికి వాళ్ళు బదులు ఇవ్వాల్సి ఉంటుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ రాష్ట్ర మహిళా ప్రధాన కార్యదర్శి బొర్రా విజయ రాణి, మాజీ సర్పంచ్ లకే పార్వతమ్మ, రాష్ట్ర ఎస్టీ సెల్ కార్యదర్శి చిట్టిబాబు, జి.మాడుగుల ఎంపిపి అప్పలరాజు, పిఏసిఎస్ చైర్మన్ డప్పోడి వెంకటరమణ జీసీసీ డైరెక్టర్ బొర్ర నాగరాజు, పాడేరు మండల పార్టీ అధ్యక్షుడు రేగం కొండబాబు, పాడేరు నియోజకవర్గం మహిళా అధ్యక్షురాలు లకే పార్వతమ్మ, పాడేరు నియోజకవర్గ మహిళా ప్రధాన కార్యదర్శి డిప్పల వెంకట కుమారి, కొయ్యూరు మండల పార్టీ ప్రధాన కార్యదర్శి దొరబాబు, గూడెం క్లస్టర్ ఇంచార్జ్ నళినికృష్ణ తదితరులు పాల్గొన్నారు.




## మొక్క జొన్న కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయాలి. రైతు సంఘం.



**సాలూరు. పెన్ పవర్. ఏప్రిల్ 10.** మొక్కజొన్న పంటకు మద్దతు ధర ఇవ్వాలి కొనుగోలు కేంద్రాలు వెంటనే ఏర్పాటు చేయాలని ఏపీ రైతు సంఘం నాయకులు గొర్లె రామారావు బోను పైడియ్య ఆధ్వర్యంలో గురువు నాయుడుపేట మాతుమూరు హైవే జంక్షన్ వద్ద ప్రభుత్వాన్ని కోరారు ఈ సందర్భంగా గొర్ల రామారావు పైడియ్య పత్రిక విలేకరులతో మాట్లాడుతూ మద్దతు ధర కి ట్లం 24,000 ఉన్నప్పటికీ ప్రభుత్వాలు కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయకపోవడం మధ్య దళారీల నుండి ప్రైవేట్ వ్యాపారుల నుండి మోసపోతున్నామని 1400 నుండి 1500 ఇలా ప్రైవేట్ వ్యాపారులు కొంటున్నారని రైతులు ఉంచుకోవడానికి స్థలాలు లేక పంటను నష్టమైనా అమ్మ వలసిన పరిస్థితి ఏర్పడిందని ఆవేదన వ్యక్తం చేశారు ఎకరానికి 35000 నుండి 40 వేల వరకు పెట్టుబడి పెట్టిన రైతు సరైన గిట్టుబాటు లేక నష్టపోతున్నాడని ప్రభుత్వం వెంటనే ఆదుకోవాలని అన్నారు. సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు కోరాడ ఈశ్వరరావురైతులకు మద్దతుగా మాట్లాడుతూ తెలంగాణ ప్రభుత్వం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసి మొక్కజొన్న ఆంధ్ర ప్రదేస్ కోటం ప్రభుత్వం ప్రభుత్వం ఆ విధంగా ఆలోచించి రైతును ఆదుకోవాలని అన్నారు ఇటీవల కురిసిన వడగళ్ల వాన వీధులు గాలుల వలన మొక్కజొన్న రైతులు చాలామంది నష్టపోయారు వారికి పరిహారం కూడా అందించే విధంగా చర్యలు తీసుకోవాలని అన్నారు.ం

## రింతాడ వై జంక్షన్ కుదింపు.. ప్రమాదాలకు ఆహ్వానం

ఎన్హెచ్-516 నిర్మాణంపై ప్రయాణికుల ఆందోళన



**గూడెం కొత్తవీధి,పెన్ పవర్, ఏప్రిల్ 10:** అల్లూరి సీతారామరాజు జిల్లాలో నిర్మిస్తున్న ఎన్హెచ్-516 జాతీయ రహదారి పనుల్లో అధికారులు తీసుకుంటున్న అనాలోచిత నిర్ణయాలు ప్రయాణికుల ప్రాణాలకు ముప్పుగా మారుతున్నాయని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ముఖ్యంగా జంక్షన్ల వద్ద వై-జంక్షన్లు ఏర్పాటు చేస్తూ రహదారి వెడల్పును తగ్గించడంతో ప్రమాదాలకు ఆస్కారం పెరుగుతోందని చెబుతున్నారు.జీకే వీధి మండలం రింతాడ గ్రామం మీదుగా హైవే నిర్మాణ పనులు జరుగుతున్నాయి. ఈ క్రమంలో రింతాడ జంక్షన్ వద్ద జీకే వీధి వైపు వెళ్లే మార్గానికి వై-జంక్షన్ ఏర్పాటు చేయాల్సి ఉంది. అయితే రహదారి నిర్మాణం పూర్తయిన తర్వాత మధ్యలో గోతులు తవ్వి జంక్షన్ ఏర్పాటు చేయడంతో, అప్పటికే ఉన్న రహదారి వెడల్పు తగ్గిపోయిందని స్థానికులు ఆరోపిస్తున్నారు.జాతీయ రహదారి కావడంతో వేగంగా వచ్చే వాహనాలు ఈ వై-జంక్షన్ వద్ద మలుపు తిరిగే సమయంలో ప్రమాదాలు జరిగే అవకాశం ఎక్కువగా ఉందని ప్రయాణికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. సర్వీస్ రోడ్లు కూడా సక్రమంగా ఏర్పాటు చేయకపోవడం సమస్యను మరింత పెంచుతోందని పేర్కొంటున్నారు. రహదారి వెడల్పు తగ్గించకుండా, శాస్త్రీయ పద్ధతుల్లో జంక్షన్ నిర్మాణం చేపట్టాలని ప్రయాణికులు, స్థానికులు కోరుతున్నారు.

## సేంద్రియ పద్ధతిలో పండించే పంటలకు గిట్టుబాటు ధర కల్పించటానికి





- మేడిన్ అరకు వెల్ఫేర్ సొసైటీ కృషి
- ఐటిడిఏ ప్రాజెక్టు అధికారి తిరుమాని శ్రీ పూజ.

**స్టాఫ్ రిపోర్టర్,పాడేరు,పెన్ పవర్, ఏప్రిల్ 10:** అల్లూరి జిల్లా పాడేరు సమీకృత గిరిజన అభివృద్ధి సంస్థ పరిధిలో సేంద్రియ పద్ధతిలో పండించే పంటలకు గిట్టుబాటు ధర కల్పించటానికి కృషి చెద్దామని ఐటిడిఏ ప్రాజెక్టు అధికారి తిరుమాని శ్రీ పూజ అన్నారు. శుక్రవారం ఉదయం ఐటిడిఏ ప్రాజెక్టు అధికారి వారి కార్యాలయం లో ఐటిడిఏ సహాయ సహకారం తో నూతనంగా ఏర్పాటు చేసిన మేడిన్ అరకు వెల్ఫేర్ సొసైటీ (ఎఫ్.పి.ఓ) ఏర్పాటుచేస్తూ జరిగిన సమావేశంలో ఆమే మాట్లాడుతూ సొసైటీ యొక్క ముఖ్య ఉద్దేశం అల్లూరి సీతారామరాజు జిల్లాలో సేంద్రియ పద్ధతి ద్వారా గిరిజనులు పండించే పంటలకు నాణ్యత ప్రమాణా పరిక్షలు చేయడం,వాటిని ప్యాకింగ్ చేయడం మరియు పండించిన పంటలకు అధునాతన పద్ధతిలో బార్ కోడ్ ఇవ్వడం అలాగే బార్ కోడ్ నందు వినియోగదారుడకు పంట యొక్క పూర్తి సమాచారం బార్ కోడ్ నందు పొందుపరచడం,సేంద్రియ పద్ధతి ద్వారా పండించిన పంటలను విశాఖపట్నం లాంటి నగరాల్లో రైతుబజారుల నందు నేరుగా వినియోగదారుడుకి రైతు నేరుగా అమ్ముకొనుటకు ఏర్పాట్లు చేయడం,పండిశీచిన పంటకు సరైన గిట్టుబాటు ధర కల్పించడం.దళారుల వద్ద రైతులు మోషపోకుండా రైతులకు అవగాహన కల్పించడం,గిరిజన రైతులకు సేంద్రియ పద్ధతి వ్యవసాయం చేయడానికి అందులో అధిక దిగుబడి తీసుకొని రావడానికి కావాల్సిన సలహాలు సూచనలు ఎప్పటికప్పుడు రైతులకు అందించడం జరుగుతుందని, సేంద్రియ పద్ధతిలో పండించే పంటలకు కార్పోరేట్ కంపినీలుతో నేరుగా మాట్లాడి వారు నేరుగా రైతుల నుంచి పంటను కొనుగోలు చేసేవిదంగా కృషి చేయడం, సేంద్రియ పద్ధతిలో పండించే పంటలకు సంస్థ ద్వారా అనుమతి పొందిన కంపినీల భాగస్వామ్యం తో గిరిజన రైతులకు ఆర్గానిక్ సర్టిఫికెషన్ కల్పించడం వంటి కార్యక్రమాలు మేడిన్ అరకు వెల్ఫేర్ సొసైటీ (ఎఫ్.పి.ఓ) ద్వారా గిరిజన రైతులకు పూర్తి సహకారం అందిస్తుందని అన్నారు.అనంతరం ఈ కార్యక్రమం లో పాల్గొన రైతులతో కలిసి ఎన్నిక నిర్వహించి ఏకగ్రీవంగా ఎన్నికకాబడిన మేడిన్ అరకు వెల్ఫేర్ సొసైటీ (ఎఫ్.పి.ఓ) కార్యవర్గాని ప్రకటించారు.అధ్యక్షుడు తామరి సురేష్ బాబు,ఉపాధ్యక్షుడు కిల్లో పురుషోత్తశీ,కార్యదర్శి సోమేలి శంకురాజు,సహాయ కార్యదర్శి రాపి అప్పారావు,కోశాధికారి:కిల్లో లక్ష్మయ్య,మెంబర్లు నందుల చిన్న గంగులు,గేమ్మిలి రాంబాబు,పాంగి జినబందు,బూడిద చిన్నాబ్బాయి,మరశీ సూర్యనారాయణ పడాల్ ను ఎంపిక చేసారు.

ఈ కార్యక్రమంలో ఐటిడిఏ పరిపాలన అధికారి ముత్యాల హేమలత, ఐటీడీఏ ట్రైకర్ అసిస్టెంట్ ఎన్.సీతారామయ్య,ఎ.సంతోష్ తో పాటు 11 మండలాల నుంచి వచ్చిన రైతుల తదితరులు పాల్గొన్నారు.

## వివిధ రకాల పంటలు వాతావరణ పరిస్థితులు పైన రైతులకు అవగాహన కార్యక్రమం




**పద్మనాభం, పెన్ పవర్, ఏప్రిల్ 10 :** పద్మనాభం, మండల కేంద్ర మై న మండల కాం ప్లెక్స్ ప్రాంగణంలో ఉన్న వెలుగు కార్యాలయం లో ఉన్న మీటింగ్ హాల్లో పద్మనాభం, ఆనందపు రం ,భీమిలి మండల అభ్యుదయ రైతులకు ప్రస్తుతం ఉన్న వాతావరణ పరిస్థితులు ఎలిని నో ప్రభావం కారణంగా 2026 ఖరీఫ్ సీజన్లో రైతులు ఎటువంటి పంటలను సాగు చేయాలి అదేవిధంగా తక్కువ వర్షపాతంతో పంటలను ఏవిధంగా సంరక్షించుకోవాలి ,పడిన వర్షపాతా న్ని ఏ విధంగా సద్వినియోగం చేసుకోవాలి అనే విషయమై రైతులు శాస్త్రవేత్తలతో కిసాన్ ఘోష్టి కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమం మండల వ్యవసాయ శాఖ అధికారి వెంకటాచ లం ఆధ్వర్యంలో శుక్రవారం నిర్వహించారు.

ఈ కార్యక్రమంలో సుమారు 170 మంది రైతు లు పాల్గొన్నారు. కార్యక్రమానికి శాస్త్రవేత్తలు ఎన్ రాజకుమార్, ఏ సౌజన్య కృషి విజ్ఞాన కేం ద్రం కొండెంపూడి నుంచి హాజరయ్యారు . అదేవి ధంగా స్థానిక సహాయ వ్యవసాయ సంచాలకులు, భీమిలి బి విజయ ప్రసాద్ ,వ్యవసాయ అధికారులు ,ఆనందపురం మండలం సంధ్యా రత్నప్రభ, భీమిలి మండలం శివకోమలి, పెదగం ట్యాడ మండలం శశికళ ,ఎరువుల నాణ్యత నిరంతర పరీక్ష అధికారి పి శ్రీకాంత్ గ్రామ వ్యవ సాయ విస్తరణ అధికారులు హాజరయ్యారు,

రైతులు స్వల్పకాలిక పంటలను పండించి అధిక లాభాలను పొందండి మండలంలోని 22 గ్రామ పంచాయతీల్లో ఉన్న వ్యవసాయం చేస్తున్న రైతులు దీర్ఘకాలిక పంటలను తగ్గించి స్వల్పకా లిక పంటల పైన ముగ్గు చూపాలని భీమిలి వ్యవసాయ శాఖ ఏడిఏ డి విజయపసాద్ శుక్రవారం మండల కాంప్లెక్స్ ప్రాంగణంలో జరిగి న రైతుల సమావేశంలో ఆయన పాల్గొని ప్రసంగించారు. ప్రస్తుతం ఉన్న పరిస్థితుల్లో ఎలినినో ప్రభావం కారణంగా ఉష్ణోగ్రతలు పెరిగే అవకాశం ఉందని తద్వారా వర్షాలు కూడా సకాలంలో పడకపోవచ్చు.

## మామిడిపల్లిలో ఫ్రైడే డ్రైడే గురించి అవగాహన కార్యక్రమం

- పట్టణ తాసిల్దార్ మామిడిపల్లి. సురేష్




**సాలూరు పెన్ పవర్ ఏప్రిల్ 10:** సాలూరు మండలం మామిడిపల్లి గ్రామంలో ఫ్రైడే డ్రైడే కార్యక్రమం శుక్రవారం నిర్వహించామని తాసిల్దార్ ఎం సురేష్ స్థానిక విలేకరులకు తెలిపారు.ఆయన తెలియజేసిన వివరాలు ప్రకారం అక్కడ గ్రామ ప్రజలకు డ్రైడే గురించి అవగాహన కల్పించామన్నారు.అలాగే పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలని పలు సూచనలు చేశామన్నారు.అంతేకాకుండా పారిశుధ్య కార్మికులతో దోమల నివారణకు కాలువలలో మందు పిచికారి దగ్గరుండి చేయించారు. అలాగే నీటి నిల్వలు లేకుండా చర్యలు చేపట్టామని ఎమ్మార్వో స్పష్టం చేసారు సచివాలయ,అంగన్వాడి,ఆశాలు పాల్గొన్నారు.

## గర్భిణీ స్త్రీలకు ఆసుపత్రిలో ప్రసవం పొందడమే సురక్షితం

వైద్య నిపుణులు శ్రీలత, వాసవి.



**చింతపల్లి పెన్ పవర్ ఏప్రిల్ 10.** గర్భిణీ స్త్రీలు ఆసుపత్రిలో ప్రశువం పొందడం సురక్షితమైన అంశమని స్త్రీ వైద్య నిపుణురాలు డాక్టర్ ఒంద్రు శ్రీలత అన్నారు. శుక్రవారం స్థానిక ఏరియా ఆసుపత్రిలో ప్రధానమంత్రి సురక్షిత మంత్రిత్వ అభియాన్ కార్యక్రమంలో భాగంగా 195 మంది గర్భిణీ స్త్రీ లకు వైద్య నిపుణులు వైద్య పరీక్షలు నిర్వహించి అల్ట్రాసౌండ్ స్కానింగ్ పరీక్షలు నిర్వహించారు, ఈ సందర్భంగా వైద్య నిపుణులు మాట్లాడుతూ గర్భిణీ స్త్రీలు 9 నెలలు ఒక్కసారైనా స్కానింగ్ చేయించుకోవాలన్నారు దీని ద్వారా ప్రమాదకరమైన ప్రసవాలను ముందుగా గుర్తించటానికి అవకాశం ఉంటుందన్నారు. గర్భిణీ స్త్రీలు క్రమంగా ఆరోగ్య తనిఖీలు చేయించుకుంటూ పోషకాహారం తీసుకోవాలన్నారు. పురికి నొప్పులు ప్రారంభమైనప్పటి నుండి ఆసుపత్రికి తరలించడం కంటే గర్భిణీలు ప్రసవ సమయానికి 10 రోజులు ముందుగానే చింతపల్లి గర్భిణుల వసతి గృహంలో. ఆసుపత్రిలో ప్రసవం పొందడం వల్ల మాతా శిశు మరణాలను నియంత్రించడానికి అవకాశం ఉంటుందన్నారు. గర్భిణులకు వసతి గృహంలో పూర్తిస్థాయి సదుపాయాలు అందుబాటులో ఉంటాయని గర్భిణీలు సహాయకులకు భోజన సదుపాయం కల్పించడం జరుగుతుందన్నారు ప్రతి గర్భిణి వసతి గృహం సేవలను సద్వినియోగం చేసుకోవాలన్నారు గృహాల్లో ప్రసవం పొందడం తల్లి బిడ్డ ఆరోగ్యానికి సురక్షితం కాదన్నారు ఈ కార్యక్రమంలో స్త్రీ వైద్య నిపుణులు వైద్యాధికారిని రుక్మిణి, లావణ్య పాల్గొన్నారు.

# మాజీ మంత్రి కన్నబాబును కలిసిన పెందుర్తి నేతలు

**పెందుర్తి, కాకినాడ, పెన్ పవర్, ఏప్రిల్ 10 :** ఉత్తరాంధ్ర ప్రాంతీయ కోఆర్డినేటర్, మాజీ మంత్రివర్యులు కురసాల కన్నబాబుని ఈ రోజు కాకినాడలోని ఆయన నివాసంలో పెందుర్తి మాజీ శాసనసభ్యులు మరియు నియోజకవర్గ సమన్వయకర్త అన్నంరెడ్డి అదీప్ రాజ్ మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ప్రాంతీయ రాజకీయ పరిణామాలు, పార్టీ బలోపేతం, రాబోయే కార్యక్రమాలపై వారు చర్చించినట్లు సమాచారం. నాయకుల మధ్య సాన్నిహిత్య వాతావరణంలో జరిగిన ఈ భేటీకి ప్రత్యేక ప్రాధాన్యం నెలకొంది. ఈ కార్యక్రమంలో పెందుర్తి మాజీ మార్కెటింగ్ కమిటీ చైర్మన్ కోడిగుడ్ల దేవి సాంబ, అనకాపల్లి జిల్లా ఐటీ వింగ్ వైస్ ప్రెసిడెంట్ జతిన్ యాదవ్, అనకాపల్లి జిల్లా యూత్ వింగ్ వైస్ ప్రెసిడెంట్ వ్యాపాద శీను, సంతోష్ తదితరులు పాల్గొన్నారు. ఈ భేటీతో ఉత్తరాంధ్రలో పార్టీ కార్యకలాపాలకు మరింత వేగం వచ్చే అవకాశం ఉందని నాయకులు ఆశాభావం వ్యక్తం చేశారు.



# సీఎం చంద్రబాబును కలసి పెళ్లికి ఆహ్వానించిన జీసీసీ చైర్మన్ కిడారి శ్రావణ్ కుమార్

**వివాహ శుభలేఖ అందజేత.. ఆత్మీయంగా పలకరించిన ముఖ్యమంత్రి**

**స్టాఫ్ రిపోర్టర్,పాడేరు,పెన్ పవర్, ఏప్రిల్ 10:**అమరావతి సచివాలయంలో రాష్ట్ర గిరిజన సంక్షేమ శాఖ మంత్రి గుమ్మడి సంధ్యారాణి సమక్షంలో రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడును రాష్ట్ర గిరిజన సహకార సంస్థ (జీసీసీ) చైర్మన్ కిడారి శ్రావణ్ కుమార్ మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఆయన తన వివాహ శుభలేఖను ముఖ్యమంత్రికి అందజేసి, వివాహానికి విచ్చేసి ఆశీర్వదించాలని ఆహ్వానించారు. శ్రావణ్ కుమార్‌తో ఆత్మీయంగా మాట్లాడిన ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, వివాహ తేదీని తన షెడ్యూల్‌లో నమోదు చేయాలని సూచించారు.అలాగే వధువు వివరాలు, ఆమె స్వగ్రామం, విద్యార్హతలు, ప్రస్తుతం చేస్తున్న కార్యకలాపాలపై ముఖ్యమంత్రి ఆసక్తిగా అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన నూతన వధూవరులకు శుభాకాంక్షలు తెలియజేస్తూ, వారి దాంపత్య జీవితం సుఖసంతోషాలతో నిండాలని ఆకాంక్షించారు.



## రైతు బజార్ గోపాలపట్నంలో టీబీ అవగాహన కార్యక్రమం



**విశాఖ పశ్చిమ, పెన్ పవర్, ఏప్రిల్ 10** : దేశాన్ని టీబీ రహితంగా మార్చే లక్ష్యంతో కేంద్ర ప్రభుత్వం చేపట్టిన కార్యక్రమాల మేరకు గోపాలపట్నం రైతు బజార్‌లో విస్తృత స్థాయిలో టీబీ వ్యాధిపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమం రాష్ట్ర టీబీ ప్రత్యేక అధికారి రమేష్ ఆదేశాల మేరకు "టీబీ ఫ్రీ ఇండియా 2.0" కార్యక్రమంలో భాగంగా నిర్వహించబడింది. ఈ సందర్భంగా వైద్య సిబ్బంది ప్రజలకు టీబీ లక్షణాలు, నిర్ధారణ విధానం, నివారణ చర్యల గురించి వివరించారు. రెండు వారాల పాటు దగ్గు తగ్గకపోవడం, వారం రోజుల పాటు జ్వరం తగ్గకపోవడం, ఆకలి లేకపోవడం, బరువు అకస్మాత్తుగా తగ్గిపోవడం వంటి లక్షణాలు ఉన్న వారు తప్పనిసరిగా కఫం పరీక్షలు చేయించుకోవాలని సూచించారు. ముఖ్యంగా 60 సంవత్సరాల పైబడిన వారు, మద్యపానం మరియు ధూమపానం అలవాట్లు ఉన్నవారు మరింత జాగ్రత్తగా ఉండాలని తెలిపారు.

టీబీ నిర్ధారణ అయిన వారికి ప్రభుత్వం ఆరు నెలలపాటు ఉచితంగా మందులు అందిస్తుందని అధికారులు తెలిపారు. సీనియర్ టీబీ సూపర్వైజర్ వి.శ్రీనివాసరావు, ల్యాబ్ సూపర్వైజర్ జి. వెంకట్ రమణ మాట్లాడుతూ, టీబీ బాధితులకు ఉచిత పరీక్షలు మరియు చికిత్స సౌకర్యాలు అందుబాటులో ఉన్నాయని చెప్పారు. వ్యాధి వ్యాప్తిని అరికట్టేందుకు దగ్గినప్పుడు నోటికి చేయి అడ్డం పెట్టుకోవడం, బహిరంగ ప్రదేశాల్లో ఉమ్మి వేయకపోవడం వంటి జాగ్రత్తలు పాటించాలని ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ చర్యల ద్వారా టీబీ వ్యాధి ఒకరి నుంచి మరొకరికి వ్యాపించకుండా నివారించవచ్చని వివరించారు. ఈ కార్యక్రమంలో రైతు బజార్ ఎస్టేట్ అధికారి జి. ప్రసాద్, సహాయకులు జి. శ్రీనాథ్, టీపీ హెల్త్ విజిటర్ జి. కరుణ, ఏఎన్ఎం కే. వెంకట్రావు, ఆశా వర్కర్లు, రైతులు, వ్యాపారస్తులు, వినియోగదారులు పాల్గొన్నారు. ప్రజలందరూ టీబీ వ్యాధిపై అవగాహన పెంపొందించుకుని ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని అధికారులు పిలుపునిచ్చారు.

## గిరిజన ప్రాంతంలో పెట్రోల్, గ్యాస్ కు కొరతలేదు.

**జిసిసి డీజీఎం బి. సూర్యనారాయణ.**



**చింతపల్లి పెన్ పవర్ ఏప్రిల్ 10.** అల్లూరి సీతారామరాజు జిల్లా గిరిజన ప్రాంతంలో పెట్రోల్ గ్యాస్ వంటి వాటికి కొరతలేదని గిరిజన సహకార సంస్థ డిప్యూటీ జనరల్ మేనేజర్ (డీజీఎం) బి. సూర్యనారాయణ అన్నారు. శుక్రవారం ఆయన మండల కేంద్రంలో ఉన్న గ్యాస్ గోదాము, పెట్రోల్ బంక్ ని ఆకస్మికంగా తనిఖీ చేశారు. రికార్డులు, నిల్వలు, నగదు వంటి వాటిని పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రవ్యాప్తంగా జిసిసి పరిధిలో 16 పెట్రోల్ బంకులు ఉన్నాయన్నారు. పెట్రోల్ బంకులను మూడు నెలలకు ఒకసారి తనిఖీలు నిర్వహిస్తామన్నారు. జిసిసి పరిధిలో ని పెట్రోల్ బంకులు గ్యాస్ ఏజెన్సీల నుంచి ప్రజలకు మెరుగైన సేవలను అందిస్తున్నామన్నారు. బ్రాంచి పరిధిలో గ్యాస్ ఏజెన్సీ నిర్వహణ సంతృప్తికరంగా ఉందని పెట్రోల్ బంకులు నాలుగు నెలలుగా జరిగిన లావాదేవీలను పరీక్షిస్తున్నమన్నారు. నిలువలు నగదులో తేడాలు ఉన్నట్లు గుర్తిస్తే ఉద్యోగుల నుంచి రికవరీ చేస్తామన్నారు. పచ్చిమాసియా దేశాల్లో జరిగిన యుద్ధం కారణంగా ఇంధన కొరత ఏర్పడినప్పటికీ ఈ ప్రభావం ప్రజలపై పడకుండా రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక చర్యలు చేపట్టిందన్నారు. ఎక్కడ కూడా గ్యాస్ ,పెట్రోలు వంటి వాటికి కొరత లేకుండా పూర్తిస్థాయిలో నిలువలను అందుబాటులో ఉంచుతున్నామన్నారు. జిసిసి పెట్రోల్ బంక్ నిర్వహణలో నష్టం నడుస్తుంది అన్నారు. గతంలో క్రెడిట్ బేస్ లో పెట్రోల్, డీజిల్ సరఫరా చేసే వారని, ప్రస్తుతం ముందుగా చెల్లింపులు చేయవలసి వస్తుందన్నారు. ఈ కారణంగా జీకే వీధి పెట్రోల్ బంకు వారం రోజులపాటు సేవలను నిలిపివేయాల్సి వచ్చిందన్నారు. ప్రస్తుతం యధావిధిగా బంకు సేవలు అందిస్తున్నామన్నారు. పెట్రోల్ బంక్ పరిధిలో అవుట్ సోర్సింగ్ ఉద్యోగులు వినియోగదారులతో మర్యాదగా మెలగాలని ఖచ్చితమైన ఆదేశాలు జారీ చేశామన్నారు. దురుసుగా ప్రవర్తించే వారిపై వినియోగదారులు సంబంధిత అధికారులకు ఫిర్యాదు చేయవచ్చును అన్నారు. విధులను అలాగే వినియోగదారులపై బాధ్యతారహితంగా వ్యవహరించిన ఉద్యోగులపై చర్యలు తీసుకుంటామన్నారు. ఈ కార్యక్రమంలో జిసిసి టెక్నికల్ అధికారి వెంకటేశ్వరరావు బ్రాంచి మేనేజర్ చల్లంగి సుగునాదం సిబ్బంది పాల్గొన్నారు.

# బుచ్చయ్యపేట పోలీస్ స్టేషన్‌పై ఆకస్మిక తనిఖీ

- శాంతిభద్రతల పరిరక్షణలో రాజీ వద్దు
- అనకాపల్లి జిల్లా ఎస్పీ తుహిన్ సిన్హా





**అనకాపల్లి, పెన్ పవర్, ఏప్రిల్ 10** : స్థానిక అనకాపల్లి జిల్లా బుచ్చయ్యపేట పోలీస్ స్టేషన్‌లో శాంతిభద్రతల నిర్వహణపై జిల్లా ఎస్పీ తుహిన్ సిన్హా ఆకస్మిక తనిఖీ నిర్వహించారు. శుక్రవారం జరిగిన ఈ తనిఖీలో స్టేషన్ పనితీరు, పెండింగ్ కేసులు, నేర నియంత్రణ చర్యలను ఆయన సమగ్రంగా పరిశీలించారు. ఈ సందర్భంగా ఎస్పీకి అనకాపల్లి సబ్‌డివిజన్ డీఎస్పీ ఎం.శ్రావణి, కొత్తకోట సీఐ జి. కోటేశ్వరరావు, ఎస్సై ఏ.శ్రీనివాసరావు స్వాగతం పలికారు. అనంతరం స్టేషన్ రికార్డులు, కేసుల దర్యాప్తు పురోగతిపై సమీక్ష నిర్వహించారు. ఆస్తి దొంగతనాలను అరికట్టేందుకు ప్రత్యేక ప్రణాళికలు రూపొందించాలని, రాత్రి-పగలు బీట్లు పటిష్టం చేసి నిరంతర పెట్రోలింగ్ చేపట్టాలని ఎస్పీ ఆదేశించారు. శాంతిభద్రతలకు విఘాతం కలిగించే వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని స్పష్టం చేశారు. రౌడీ షీటర్లను ప్రతి వారం స్టేషన్‌కు పిలిపించి కౌన్సెలింగ్ నిర్వహించాలని, చట్ట వ్యతిరేక చర్యలకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించాలని సూచించారు.

రోడ్డు భద్రత, సైబర్ నేరాలపై ప్రజలకు అవగాహన కల్పించాలని, ముఖ్యంగా పాఠశాలలు, కళాశాలల్లో విద్యార్థులు, మహిళలు, బాలబాలికలకు రక్షణ చట్టాలపై కార్యక్రమాలు నిర్వహించాలని పేర్కొన్నారు. పోలీసు అధికారులు తరచుగా గ్రామాలను సందర్శించి మహిళా సంరక్షణ కార్యదర్శులతో సమన్వయం పెంచుకోవాలని, వారు అందించే సమాచారంపై తక్షణ చర్యలు తీసుకోవాలని సూచించారు. గంజాయి అక్రమ రవాణాపై కఠిన చర్యలు తీసుకోవాలని, గ్రామాల్లో సీసీటీవీ కెమెరాల ఏర్పాటు కోసం ప్రజలను ప్రోత్సహించాలని తెలిపారు. పెండింగ్ కేసులు, సీజ్ చేసిన వాహనాల పరిష్కారాన్ని వేగవంతం చేయాలని ఆదేశించారు. స్టేషన్ సిబ్బందితో సమావేశమైన ఎస్పీ, విధుల్లో క్రమశిక్షణ, నిబద్ధత తప్పనిసరి అని హెచ్చరించారు. ప్రజలకు అందుబాటులో ఉండి సేవ చేయాలని, విధుల్లో నిర్లక్ష్యం వహిస్తే శాఖాపరమైన చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. ఈ తనిఖీ కార్యక్రమంలో ఎస్సై ఏ. శ్రీనివాసరావు సహా పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

# వేసవి ప్రయాణాల్లో జాగ్రత్తలు తప్పనిసరి

**మైనర్లకు వాహనాలిస్తే కఠిన చర్యలు ఎస్పీ హెచ్చరిక**



**అనకాపల్లి, పెన్ పవర్, ఏప్రిల్ 10** : వేసవి సెలవుల నేపథ్యంలో ప్రజలు సురక్షితంగా ప్రయాణాలు సాగించాలని, ముఖ్యంగా తల్లిదండ్రులు తమ పిల్లల విషయంలో మరింత బాధ్యతగా వ్యవహరించాలని అనకాపల్లి జిల్లా ఎస్పీ తుహిన్ సిన్హా సూచించారు. ఈ మేరకు జిల్లా పోలీస్ శాఖ ఒక పత్రికా ప్రకటన విడుదల చేసింది. వేసవి సెలవుల్లో మైనర్లు సరదా కోసం ద్విచక్ర వాహనాలు లేదా ఇతర వాహనాలు నడిపే ప్రమాదం ఎక్కువగా ఉంటుందని ఎస్పీ పేర్కొన్నారు. 18 సంవత్సరాల లోపు వయస్సు గల వారికి వాహనాలు ఇవ్వడం చట్టరీత్యా నేరమని స్పష్టం చేశారు. మైనర్లు వాహనాలు నడుపుతూ పట్టుబడితే వాహన యజమానులు మరియు తల్లిదండ్రులపై కఠిన చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈ చర్యల్లో భారీ జరిమానాలు, జైలు శిక్షలు కూడా ఉండే అవకాశముందని తెలిపారు. ట్రాఫిక్ రద్దీ సమయంలో వాహనదారులు సహనం కోల్పోయి రాంగ్ రూట్‌లో వెళ్లడం, అడ్డదిడ్డంగా డ్రైవింగ్ చేయడం వల్ల ప్రమాదాలు సంభవించే అవకాశం ఉందని చెప్పారు.

అందువల్ల ట్రాఫిక్ నియమాలను పాటిస్తూ, వరుస క్రమంలో వేచి ఉండి పోలీసులకు సహకరించాలని కోరారు. సుదూర ప్రయాణాలకు బయలుదేరే ముందు వాహనాల పరిస్థితిని పూర్తిగా తనిఖీ చేసుకోవాలని సూచించారు. ముఖ్యంగా టైర్లు, బ్రేకులు, ఇంజిన్ సరిగా ఉన్నాయా అన్నది పరిశీలించుకోవాలని చెప్పారు. జాతీయ రహదారులపై ప్రయాణించే సమయంలో రోడ్డు భద్రతా నియమాలను కచ్చితంగా పాటించాలని, ఎట్టి పరిస్థితుల్లోనూ హైవేలపై వాహనాలను నిలపరాదని హెచ్చరించారు.

ద్విచక్ర వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని, వేసవి ఎండల కారణంగా తగినంత నీటిని వెంట తీసుకెళ్లాలని సూచించారు. సుదీర్ఘ ప్రయాణాలు చేసే వారు పగటి సమయంలోనే ప్రయాణానికి ప్రాధాన్యత ఇవ్వాలని పేర్కొన్నారు. ప్రయాణంలో ఎటువంటి అత్యవసర పరిస్థితులు తలెత్తినా వెంటనే పోలీసులను సంప్రదించాలని తెలిపారు. సహాయం కోసం డయల్ 100 / 112 మరియు హైవే హెల్ప్ లైన్ 1033 నంబర్లను వినియోగించాలని సూచించారు. "రహదారి నిబంధనలు పాటించడం అంటే మన ప్రాణాలను మనం గౌరవించుకోవడమే. వేసవి సెలవుల్లో ప్రతి ప్రయాణం సురక్షితంగా సాగాలని ఎస్పీ తుహిన్ సిన్హా అన్నారు.

# కొత్తకోట, రోలుగుంట పోలీస్ స్టేషన్లపై ఎస్పీ ఆకస్మిక తనిఖీలు





**శాంతిభద్రతల పరిరక్షణలో రాజీ లేకుండా పనిచేయాలని ఆదేశాలు**

**అనకాపల్లి, పెన్ పవర్, ఏప్రిల్ 10 :** అనకాపల్లి జిల్లా ఎస్పీ తుహిన్ సిన్హా శుక్రవారం జిల్లాలోని కొత్తకోట మరియు రోలుగుంట పోలీస్ స్టేషన్లను ఆకస్మికంగా సందర్శించి వార్షిక తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా పోలీస్ వ్యవస్థ పనితీరు, రికార్డుల నిర్వహణ, పెండింగ్ కేసుల పురోగతి తదితర అంశాలను ఆయన క్షుణ్ణంగా సమీక్షించారు. మొదట కొత్తకోట పోలీస్ స్టేషన్‌ను సందర్శించిన ఎస్పీ, స్టేషన్ పరిసరాలను, కేసు రికార్డులను పరిశీలించారు. సాంకేతికత వినియోగంపై ప్రత్యేకంగా దృష్టి సారించిన ఆయన, సి.సి.టి.ఎన్.ఎస్లో క్రైమ్ డేటా నమోదు ప్రక్రియలో ఎలాంటి జాప్యం ఉండకూడదని సిబ్బందికి ఆదేశించారు. స్టేషన్‌లో రికార్డుల నిర్వహణ పట్ల సర్కిల్ ఇన్‌స్పెక్టర్ జి. కోటేశ్వరరావును ప్రశంసించారు.

వేసవి కాలంలో ప్రజలు ఊర్లకు వెళ్లే అవకాశాన్ని దృష్టిలో ఉంచుకుని దొంగతనాలు పెరిగే అవకాశముందని హెచ్చరించిన ఎస్పీ, రాత్రి గస్తీని మరింత బలోపేతం చేయాలని సూచించారు. గంజాయి అక్రమ రవాణా, విక్రయాలు మరియు ఇతర చట్టవ్యతిరేక కార్యకలాపాలపై కఠిన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. అనంతరం రోలుగుంట పోలీస్ స్టేషన్‌ను సందర్శించిన ఎస్పీ, అక్కడి రికార్డులను, కేసుల పురోగతిని సమీక్షించారు. ఆస్తి నేరాల నివారణకు పక్కా ప్రణాళికతో ముందుకు సాగాలని, రాత్రి, పగలు సమయాల్లో బీట్లను పటిష్టం చేయాలని సూచించారు.

జిల్లాలో గంజాయి రవాణాపై రాజీలేని పోరాటం చేయాలని స్పష్టం చేశారు. రౌడీ షీటర్లపై కఠిన నిఘా పెట్టాలని, వారిని తరచూ స్టేషన్‌కు పిలిపించి కౌన్సెలింగ్ నిర్వహించాలని సూచించారు. చట్టవ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడే వారిపై ఎలాంటి ఉపేక్ష ఉండబోదని హెచ్చరించారు. ఇరు స్టేషన్ల తనిఖీల సందర్భంగా ఎస్పీ ప్రజా భద్రతకు సంబంధించిన పలు ముఖ్య సూచనలు చేశారు. వాహనదారులు ట్రాఫిక్ నిబంధనలు తప్పనిసరిగా పాటించాలని, హెల్మెట్ ధరించడం పై అవగాహన పెంచాలని తెలిపారు. పెరుగుతున్న ఆన్‌లైన్ మోసాలపై ప్రజలను అప్రమత్తం చేస్తూ, సైబర్ నేరాలకు గురైతే వెంటనే 1930 హెల్ప్‌లైన్‌కు ఫిర్యాదు చేయాలని సూచించారు. మహిళలు, బాలికల భద్రతకు అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలని, వేధింపులపై కఠిన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. 'శక్తి' యాప్ వంటి భద్రతా సదుపాయాలపై గ్రామీణ ప్రాంతాల్లో అవగాహన కల్పించాలని సూచించారు. పోలీసులు ప్రజలకు ఎప్పుడూ అందుబాటులో ఉండి, ఫ్రెండ్లీ పోలీసింగ్‌తో విశ్వాసాన్ని పెంపొందించాలని ఎస్పీ పిలుపునిచ్చారు. విధుల్లో నిర్లక్ష్యం వహిస్తే శాఖాపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు. ఈ తనిఖీలలో అనకాపల్లి సబ్ డివిజన్ డీఎస్పీ ఎం. శ్రావణి, సీఐ జి. కోటేశ్వరరావు, ఎస్సైలు శ్రీనివాస్, పి. రామకృష్ణరావు మరియు ఇతర సిబ్బంది పాల్గొన్నారు.



# గంజాయి అక్రమ రవాణా కేసులో కఠిన శిక్ష

**ముగ్గురు నిందితులకు 10 ఏళ్ల జైలు**

**రూ.లక్ష రూపాయల జరిమానా విధింపు**

**చోడవరం కోర్టు కీలక తీర్పు అక్రమ రవాణాదారులకు గట్టి హెచ్చరిక**

**అనకాపల్లి, పెన్ పవర్, ఏప్రిల్ 10** : గంజాయి అక్రమ రవాణాపై పోలీసులు చేపడుతున్న కఠిన చర్యలకు న్యాయస్థానం మద్దతు లభించింది. అనకాపల్లి జిల్లా వి.మాడుగుల పోలీస్ స్టేషన్ పరిధిలో నమోదైన భారీ గంజాయి రవాణా కేసులో చోడవరం 9వ అదనపు జిల్లా కోర్టు సంచలన తీర్పు వెలువరించింది. కోర్టు గౌరవ న్యాయమూర్తి శ్రీ ఎం. హరి నారాయణ నిందితులకు ఒక్కొక్కరికి 10 సంవత్సరాల కఠిన కారాగార శిక్షతో పాటు రూ.1 లక్ష జరిమానా విధించారు. 2015 జనవరి 10న వి.మాడుగుల మండలం గరికబంద చెక్‌పోస్ట్ వద్ద పోలీసులు వాహన తనిఖీలు నిర్వహిస్తున్న సమయంలో పాడేరు నుండి వస్తున్న టాటా సుమో (ఏపీ 9 ఏహెచ్ 8169) వాహనాన్ని ఆపి తనిఖీ చేశారు. వాహనంలో సుమారు 140 కిలోల గంజాయి అక్రమంగా తరలిస్తున్నట్లు గుర్తించారు. వెంటనే పోలీసులు వాహనం, మత్తు పదార్థం మరియు నిందితులను స్వాధీనం చేసుకుని ఎన్డిపిఎస్ చట్టం కింద కేసు నమోదు చేశారు. శిక్ష పడిన నిందితులు పానుగంటి సుబ్బారావు, కడప జిల్లా, అల్లు సత్యనారాయణ, విశాఖపట్నం, అడిగర్ల సత్తిబాబు, రాంబిల్లి మండలం, అనకాపల్లి జిల్లా ఉన్నారు.

ఈ కేసులో ప్రాసిక్యూషన్ తరపున అదనపు పబ్లిక్ ప్రాసిక్యూటర్ చీపురుపల్లి సూర్యనారాయణ బలమైన సాక్ష్యాధారాలు సమర్పించారు. దర్యాప్తు అధికారిగా అప్పటి సబ్-ఇన్‌స్పెక్టర్ జి.తేజేశ్వరరావు శాస్త్రీయంగా విచారణ నిర్వహించడం కేసు నిరూపణకు దోహదపడింది. నిందితులకు శిక్ష పడేలా కృషి చేసిన ప్రాసిక్యూషన్, దర్యాప్తు అధికారులు మరియు పోలీస్ సిబ్బందిని అనకాపల్లి జిల్లా ఎస్పీ తుహిన్ సిన్హా అభినందించారు. కోర్టు మానిటరింగ్ సెల్ అధికారుల పాత్రను కూడా ఆయన ప్రశంసించారు. "మత్తు పదార్థాల అక్రమ రవాణాపై పోలీసులు రాజీపడరు. ఈ తీర్పు అక్రమ వ్యాపారాలకు పాల్పడే వారికి గట్టి హెచ్చరికగా నిలుస్తుందని ఎస్పీ తెలిపారు.

On behalf of Printed, Published and owned by GANTYADA APPA RAO, D.No:38-4-217/A, Maharani street, Marripalem, Visakhapatnam -530018, Andhrapradesh. Printed At SRI SAI GANGA PRINTERS AND PUBLISHERS D.No:38-4-217/A, Maharani street, Marripalem, Visakhapatnam -530018, Andhrapradesh.
Editor: G.APPARAO, Mobile : 9059465965, RNI : APTEL/2014/58046, e-mail:penpower9@gmail.com